పతిత జనోద్ధరణ

రాగమంజరి ఆరుణిముని ఆశ్రమాని కల్లంత దూరంలోనే నిలబడి రెప్పపాటు లేకుండా, నిశ్చలంగా ఆ మహాముని వైపు చూచింది. ఇంతకు పూర్వం ఆమె ఎన్నడూ ఆ ఆశ్రమంలో అడుగుపెట్టలేదు; ఆరుణి ముని నెన్నడూ సందర్శించి ఉండలేదు.

చంపానగరవాసులందరూ ఆరుణి మహా తపశ్శాలి అనీ, చండీ భక్తుడనీ, పరమ బ్రహ్మణ్యుడనీ ఆరుణిని వేనోళ్ళ ప్రశంసించడం ఆమె అనేకమారులు విన్నది. ఇప్పుడు ప్రత్యక్షంగా సందర్శించగానే రాగమంజరి కా ప్రశంసలన్నీ యథార్థాలే అనిపించాయి.

ఆరుణి పద్మాసనాసీనుడై నాసాగ్రం మీద దృష్టి నిలిపి నిశ్చలంగా ధ్యానిస్తున్నాడు. అతని భ్రూమధ్యంమీది కుంకుమ తిలకం చూడగానే రాగమంజరి కది నిటలాక్షుని తృతీయ నేత్రంలా స్ఫురించింది. ప్రాతఃకాల సూర్యకాంతి అతని మేలిమివన్నె దేహచ్ఛాయలో లీనమై పోయింది. లేత లేత ఎండపొడ లతడు కూర్చున్న వ్యాఘ్రాజినం మీద రంగు రంగుల రత్నా లొలకబోశాయి.

రాగమంజరి ఆరుణిముని ధ్యానం ముగించే వరకూ అలాగే నిలబడి ఆ తేజశ్శాలి ఫాలంమీది విభూతిరేఖల తీరులు పరిశీలించింది.

కొంతసేపటి కతడు ధ్యానం ముగించి ఒక్క దీర్ఘనిశ్వాసం విడిచి పెట్టాడు. తరవాత నెమ్మదిగా పద్మాసనబంధం సడలించి యథా ప్రకారం సుఖంగా వ్యాఘ్రాజినం మీద కూర్చున్నాడు. కాని అతని దృష్టిలో ఏకాగ్రత ఇంకా సడలలేదు.

రాగమంజరి ఎంతో అడకువతో అతని సన్నిధికి నడిచివెళ్ళింది; ఉత్తర క్షణంలోనే అతని పాదాలమీద వాలిపోయింది; సభక్తికంగా సాష్టాంగ నమస్కారం చేసింది.

ఆమె కన్నీటితో ఆరుణిపాదాలు రెండూ తడిసిపోయాయి. ముని ఆమె ముంగురులు స్పృశించి అపార వాత్సల్యంతో ఆశీర్వదించాడు.

రాగమంజరి నెమ్మదిగా లేచి కూర్చుంది. ఒక్కమారు విశాల నేత్రాలతో ముని ముఖంవైపు చూచింది. ఉత్తరక్షణంలో ఆమె కనురెప్పలు వాలిపోయాయి. రాగమంజరి గద్గద స్వరంతో తన విషాదగాథ అంతా ఆరుణిమునికి వినిపించింది. నిత్యదుఃఖ భూయిష్ఠమైన సంసారంమీద విరక్తి కలిగినదని, ఇక జీవితశేషం అంతా ముని పాదపద్మసన్నిధినే తీవ్ర తపోనిరతిలోనే గడిపివేయగోరుతున్నాననీ సవినయంగా విజ్ఞప్తి చేసింది; గణికావృత్తితో తన బ్రతుకంతా మహాపాపపంకిలమై పోయినదని వాపోయింది; చండీ కరుణా కటాక్షంవల్లనే తన కావిధంగా ముని సందర్శన భాగ్యం లభించిందని ఆ దేవతకు సభక్తికంగా చేయెత్తి నమస్కరించింది.

ఆరుణి క్షణకాలం నిశ్చలంగా ఆమెవైపు చూచాడు; ఆమెచెప్పిన విషాదగాథ అంతా అత్యంత శ్రద్ధతో ఆలకించాడు.

ఆరుణిమునిది చాలా జాలిగుండె. ఎవరికైనా కొంచెం కష్టం కలిగితే అతని మనస్సిట్టే ఆర్ద్రమై ద్రవించి పోతుంది. రాగమంజరి విషాదగాథ వినగానే అతని హృదయం అపారకారుణ్యంతో కరిగిపోయింది. అతడొక్క నిమిషం వరకు ఏదో ఆలోచించాడు:

"అమ్మా! సంసార స్వభావమే అంతటిది. నీకింకా పట్టుమని పంచవింశతి వర్షాలైనా నిండినట్లు కనబడదు. దుఃఖభూయిష్ఠమైన సంసార స్వభావం నీకేమి తెలుసును!

ఇంతటి చిన్న వయస్సులో ఇంతటి వైరాగ్యం కలగడం నిశ్చయంగా పూర్వజన్మ సుకృత ఫలితమే.

కాని నీ వీ కఠిన తపశ్చర్య కోర్చుకోలేవు! నా మాట విని తిరిగి చంపా నగరానికి వెళ్ళిపో!"

అని తిరిగి తిరిగి చంపానగరానికి వెళ్ళిపోవలసిందని అనేక విధాలుగా ఆమెకు బోధించాడు. ఆమె ఆ సదుపదేశం ఎంతో శ్రద్ధగా ఆలకించింది. కాని చంపానగరానికి తిరిగి వెళ్ళిపోవడాని కంగీకరించలేదు.

"మావంటి పతిత జనోద్ధారకులు తామేనని విని కొండంత ఆశతో నే నిక్కడికి వచ్చాను. తమకుదయ కలగకపోతే, ఉరిపోసుకుని, ఇక్కడే, మీ కెదురుగానే ప్రాణత్యాగం చెయ్యవలెనని నిశ్చయించాను. అంతేనే గాని తిరిగి నే నా చంపానగరానికి వెళ్ళదలుచుకోలేదు."

ఆమె అలాగే తలవంచుకొని ఆరుణి పాదాలమీద దృష్టి నిలిపి ఊసూరుమని ఒక్క దీర్ఘనిశ్వాసం విడిచిపెట్టింది.

ఆరుణి తిరిగి మరి ఒకమారు రాగమంజరికేసి బాగా పరిశీలనగా చూచాడు.

"రాగమంజరీ! సంసారం దుఃఖభూయిష్ఠమైనదని నీవే అన్నావు గదా! నీ కేదో దారుణమైన విపత్తు సంభవించి ఉండవచ్చునని ఊహిస్తున్నాను. ఆ దుఃఖోద్వేగంలో నీకిటువంటి సంకల్పం కలిగి ఉండవచ్చు. కాని కొన్నాళ్ళ కా దుఃఖోద్వేగం ఉపశమిస్తుంది. అంతవరకు కొంచెం వేచి ఉండడం మంచిది. అప్పటికి కూడా నీలో ఈ సంకల్పం నిలబడితే తప్పక నీ వరణ్యవాసం చెయ్యవచ్చు. కాని అంతవరకు చంపానగరంలోనే ఉండడం మంచిది. నామాట విను."

అని మళ్ళీ ఆమెకు నచ్చ చెప్పాడు. అయినా ఆమె దాని కంగీకరించలేదు. ఆమెచెక్కిళ్ళపై కన్నీరు జలజలా ప్రవహించింది. అది చూడగానే ఆరుణిమనస్సు కొంచెం కరిగింది.

దూర దూరంగా గంగానదీ ఘోష జాలిగా సన్న సన్నగా వినిపించింది. శిశిరర్తు హిమబిందువులతో తడిసిన పండుటాకులు తరువుల కన్నీటి బిందువుల్లా ఒకటొకటిగా నేలరాలిపోయాయి. ఆకాశం అంతటా పొగ గమ్మినట్లు దట్టంగా మంచు పట్టింది. కాని ప్రాతఃకాల సూర్యకిరణ కాంతులలో క్రమక్రమంగా అది కరిగిపోవడం ప్రారంభించింది.

రాగమంజరి దీనాతిదీనంగా ఆరుణి మునికేసి చూసింది :

"మా వంటి పతితుల నుద్ధరించగలిగినవా రిక మీరు గాక మరెవ్వరు?"

అని మళ్ళీ తల వంచుకుంది. ఆరుణి కిక ఏమనడానికీ పాలు పోలేదు. కాని ఆమె అరణ్యవాసం అతని కంతగా రుచించలేదు. కాని కటువుగా తిరస్కరించిన పక్షంలో ఆమె ఏదైనా సాహసాని కొడిగట్టవచ్చునని అతనికి భయం వేసింది. అందుచేత ఆమెచేత ఎట్లాగైనా ఒప్పించవలెనని అనుకున్నాడు:

"అరణ్యవాసము, అందులో తపశ్చర్య అత్యంత దుష్కరమైన

నియమాలు! మా వంటి వారికే ఇవి బహుదుష్కరమైనవి. నీవంటి సుకుమారు లీ అసిధారా వ్రతా లాచరించలేరు. నా మాట విని ఈమారు చంపానగరం వెళ్ళిపో! ఆ తరవాత కూడా నీకు తపశ్చర్యమీద అభిలాష కలిగితే అప్పుడు మళ్ళీ తిరిగి వత్తువుగాని!"

ఆ మాటతో రాగమంజరి నిలువునా నీరయిపోయింది.

"స్వామీ! మా వంటి పతితులకు, పాపులకు మరి తరణోపాయం లేదా? మే మీ విధంగా ఈ సంసార పంకంలో పడి నశించి పోవలసిందేనా?"

రాగమంజరి గద్గద భారంతో మరి మాటాడలేక పోయింది. ఆ ప్రశ్న ఆరుణిహృదయం కరిగించివేసింది.

"పోనీ, నాలుగైదు రోజులపా టాశ్రమంలో ఉండు! అటు పిమ్మట కూడా నీ కింకా అరణ్యవాసం చెయ్యవలెనని అభిలాష కలిగిన పక్షంలో అప్పటిమాట ఆలోచించుకోవచ్చునులే"

అని ఆరుణి తన శిష్యుల నిద్దరిని పిలిచాడు. వారిద్దరూ అక్కడికి రాగానే, ఆశ్రమంలో ఆమెవసతికి తగిన ఏర్పాటులు చేయవలసిందని ఆజ్ఞాపించాడు. వారిద్దరూ ఆమెకొక చిన్న పర్ణకుటీరంలో వసతి ఏర్పాటు చేశారు.

రాగమంజరి ఆ పర్ణకుటీరంలో ప్రవేశించబోయే ముందు ఆరుణి మునిపాదాలకు సాష్టాంగ నమస్కారం చేసింది. పాదధూళి ఎంతో నమ్రతతో శిరస్సుమీద చల్లుకొని, నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ పర్ణకుటీరంలో ప్రవేశించింది.

2

ఆమరునాటి సాయంకాలమే, గోధూళివేళ రాగమంజరితల్లి వలవలా ఏడుస్తూ ఆశ్రమంలో ప్రవేశించింది. ఆశ్రమాని కల్లంత దూరంలోనే ఆ ఏడ్పు విని ఆరుణిశిష్యు లామెను తమ ఆచార్యుని సన్నిధికి తోడుకు పోయారు. ఆరుణిదగ్గిరికి వస్తూనే ఆమె సాష్టాంగ నమస్కారం చేసి గోలుగోలున ఏడవడం మొదలు పెట్టింది. ఆరుణి ఎంతసే పోదార్చినా ఆమె

మరి కుదటపడలేదు. కొంతసేపటి కేడుపు ముగించింది. రాగమంజరిని చిన్నప్పటి నుంచి పెంచి పెద్దదానిని చేశానని, తన కింకెవరూ లేరని, తన వార్ధక్యంలో ఆమె ఆ విధంగా అడవులు పట్టిపోవడం కేవలం అన్యాయమనీ మొర పెట్టుకుంది. ఆమె నెల్లాగయినా తిరిగీ చంపానగరానికి పంపించవలసిందని ప్రార్థించింది.

తరవాత ఆమె రాగమంజరి పెంపకంలో తాను పడ్డ పాట్లన్నీ ఏకరువు పెట్టింది.

"స్వామీ! గణికను పెంచి పెద్దదాన్ని చెయ్యటం మాటలతో పని గాదు. తల్లి దగ్గిర పాలు విడిచీ విడవగానే పిల్ల నింటికి తెచ్చుకోవాలి. శరీరపుష్టి కలిగించే మృష్టాహారం ఇచ్చి పోషించాలి. శరీర కాంతి పోషణ కోసం ప్రత్యేకంగా కొన్ని ప్రక్రియలు చేయించాలి. అయిదవ ఏటినుంచీ తండ్రికి కూడా ఆ పసిదాన్ని కనబడనీయకూడదు. జన్మదినోత్సవాలు పెళ్ళిళ్ళు చేసినంత మహావైభవంగా జరిగించాలి.

"నృత్య గీత నాట్య చిత్రాది కళలలో మహావిద్వాంసురాలిని చెయ్యాలి. ఇంకా మిగిలిన వ్యాకరణాది శాస్త్రాలలో కూడా తగుమాత్రం పాండిత్యం కలిగించాలి. ద్యూతాదికళలలో కూడా బాగా ప్రవేశం కలిగించాలి.

"కొంచెం వయస్సురాగానే గొప్ప గొప్ప ఉత్సవాలలో నృత్య గోష్ఠు లేర్పాటు చేయించాలి. ఆమెసౌందర్యము, పాండిత్యము నాగరికు లందరికీ బాగా తెలిసేటట్టు చెయ్యాలి. ఆమెకీర్తి నాలుగువైపులా వ్యాపించిన కొద్దీ శుల్కం కూడా దానికి అనుగుణంగా అభివృద్ధి పొందించాలి.

"ఒకవేళ ఎవరైనా ముందుగా వాగ్దానం చేసిన శుల్కం ఇవ్వకుండా తప్పించుకుపోయిన పక్షంలో అధికరణాలలో ప్రాడ్వివాకుల మూలంగా ఆ ద్రవ్యం తిరిగి రాబట్టుకోవాలి-"

అని ఆవేశ్యమాత అదే ధోరణిగా తన గోడంతా ఏకరువు పెట్టడం మొదలుపెట్టింది. ఆరుణి కది వింటున్న కొద్దీ క్రమంగా లోలోపల జుగుప్స బయలుదేరింది. ఆపైన అత డిక వినలేకపోయాడు. విసుగుగా ఒక నిట్టూర్పు విడిచిపెట్టాడు:

"సరేగాని, ఇంతకూ రాగమంజరికి సంసారంమీద ఇంతటి విరక్తి కలగడానికి కారణ మేమిటి?"

ఆ ప్రశ్న విని వేశ్యమాత మళ్ళీ గోలుగోలున రాగాలు మొదలు పెట్టింది. కొంతసేపటికి రాగాలు తగ్గించి గద్గద స్వరంతో తన గాథ ప్రారంభించింది:

"స్వామీ! బ్రహ్మదేవుడే స్వయంగా మాకీ కులవృత్తి విధించాడు. కోటివిద్యలు కులవిద్యకు సాటిరావుగదా! అందుచేత కులవృత్తి కులధర్మ ప్రకారమే నడిపించాలి. ఆ ధర్మం ఏమాత్రం ఏమరినా రౌరవాదినరకాల పాలు కావలసిందే! మా పూర్వులెన్నడూ కులధర్మం గోరంతైనా అతిక్రమించిన పాపాన్ని పోలేదు.

"ఇంతకూ మా ప్రాణాలకు చంపానగరంలో ఒక దరిద్ర బ్రాహ్మణ కుమారుడు దాపరించాడు. నా మట్టుకు నా కతడేమీ బాగున్నట్టు కనబడ లేదు. రాగమంజరి అంతటి నవమన్మథుడు మరి 'నభూతో న భవిష్యతి' అని ఆకాశాని కెత్తివెయ్యడం మొదలుపెట్టింది. అతగాడు గర్భదరిద్రుడు. పోనీ అనుకుంటే పొట్ట కోసినా అక్షరంముక్క లేదు. రాగమంజరి రాత్రింబగళ్ళూ అతగాడితోనే కాలక్షేపం చెయ్యటం మొదలుపెట్టింది."

ఆ తరవాత వేశ్యమాత ఆరుణి తన గాథ అంత శ్రద్ధగా వినడం లేదని కనిపెట్టింది.

"మావంటి వారి కష్టసుఖా లిక ఎవరితో చెప్పుకో గలము? ఇక ఆర్చేవారయినా తీర్చేవారయినా మీరే! కొంచెం దయదలిచి ఈ కాస్తా శ్రద్ధగా ఆలకించండి.

"అతగా డెప్పుడూ ఒక్క చిల్లిగవ్వ అయినా రాగమంజరి చేతిలో పెట్టిన పాపాన పోలేదు. పైగా రాగమంజరి నేను గడించిన ధనం అంతా అతగాడి కోసం వ్యయం చెయ్యటం మొదలు పెట్టింది.

"ఎప్పటికయినా దానికి బుద్ధి తిరగక పోతుందా అని నేను రెండు మూడు మాసాల వరకు ఓపిక పట్టాను. ఎంద రెందరో కుబేరులు వచ్చినా, గుడ్ల నీరు కుక్కుకొని వారినందరిని తిరగగొట్టివేశాను. అయినా రాగ మంజరి మనస్సు తిరగలేదు. పరిపరివిధాల—నయాన భయాన చెప్పి

చూచాను. కాని రాగమంజరి ససేమిరా, నా మాట వినని భీష్మించుకుని కూర్చుంది.

"ఆ సందర్భంలో నా కేమీ పాలుపోక ఒకనాడు గట్టిగా చీవాట్లు పెట్టాను. అంతటితో ఊరుకోక ఆ బ్రాహ్మణ కుమారుణ్ణి మరి నా గడప తొక్క వద్దని కటువుగా తూలనాడాను. తిరిగి మా గడప తొక్కితే దాసీలచేత చీపురుకట్ట తిరగవేయిస్తానని భయపెట్టాను. ఆ మరునాటి నుంచి అతడు మరి మా గడప తొక్కలేదు.

"అంతటితో ఆ శని విరగడ అయిపోయిందని నే నెంతైనా సంతోషించాను. అత డానాడే చంపానగరం విడిచిపెట్టి దేశాంతరాలు పట్టిపోయాడని విన్నాను. ఆ వార్త విని సంతోషించాను. ఆ మరునాటి నించి రాగమంజరి దారికి రాకపోదని ఎంతో ఆశ పడ్డాను.

"కాని నా ఆశ లన్నీ అడియాస లయిపోయాయి. ఆనాటి నించీ రాగమంజరి మరి అన్నం ముట్టడమే మానివేసింది. నానాటికీ దాని వైరాగ్యం బాగా పెచ్చు పెరిగిపోయింది. ఒకనాటి ఉదయం లేచి చూస్తే ఇంట్లో ఎక్కడా కనిపించలేదు. ఊరంతా గాలించగా మీ ఆశ్రమానికి వచ్చిందని తెలిసింది.

"మా కుటుంబం అంతా రాగమంజరి మీదే ఆధార పడి ఉంది. ఆమె ఈ విధంగా కులధర్మం విసర్జించి ఆ బ్రాహ్మణ కుమారుని యెడల అంతటి మమకారంతో వ్యవహరించడం అన్యాయం! మహా పాపం! మా కులధర్మానికి కేవలం వ్యతిరేకం!

"ఆపైన నేనేదో అన్నానని నా మీద పగబట్టి ఈ విధంగా అడవులు పట్టిపోయింది. మీ రామె నెల్లాగైనా తిరిగి నాతో పంపించక పోతే నేను మీ ఎదటే ప్రాయోపవేశం చేసి ప్రాణత్యాగం చేస్తాను. నాకిక గత్యంతరం లేదు. మీ రెల్లాగైనా కరుణించి రాగమంజరిని తిరిగీ చంపానగరానికి పంపించాలి. మా కుటుంబం సంరక్షించాలి."

అని కాళ్ళా వేళ్ళా పడి పరిపరి విధాల బతిమాలుకుంది. అటు పిమ్మట కూడా ఆమె ఇంకా ఏమేమో వెళ్ళబోసుకోవడం మొదలు పెట్టింది. ఆరుణి ఆమె మరి చెప్పనక్కరలేదన్నట్టు హస్తసంజ్ఞతో సూచించాడు. అంతటితో వృద్ధ వేశ్యమాత నోరు కట్టుపడి పోయింది.

అరుణికా పరిస్థితిలో ఎలాగో అలాగ నచ్చజెప్పి రాగమంజరిని తిరిగి ఇంటికి పంపించెయ్యడమే మంచిదని తోచింది. వెంటనే శిష్యుణ్ణి పిలిచి రాగమంజరి నక్కడికి తీసుకురావలసిందని చెప్పాడు.

ఆ వ్యవహారం అంతా రాగమంజరి పర్ణకుటీరంలోనించి ఒక కంట కనిపెట్టిచూస్తూనే ఉంది. అందుచేత శిష్యుడెంత బతిమాలినా అతని వెంట వెళ్లడాని కిష్టపడలేదు. శిష్యునికి ఆమె నిక బలవంతంగా తీసుకు వెళ్ళడం తప్ప గత్యంతరం కనిపించలేదు. అందుచేత అత డిక చేసే దేమీ లేక ఆచార్యునికా విషయం తెలియజేశాడు. అది విని ఆచార్యు డొక్క నిట్టూర్పు విడిచి పెట్టాడు. వేశ్యమాతను నెమ్మదిగా బుజ్జగించాడు:

"అమ్మా! రాగమంజరి కింకా తపస్సంటే ఏమో తెలియదు. పది పదిహేను రోజు లీ అరణ్యవాసం చెయ్యగానే తపస్సు మీది భక్తి యావత్తూ దానంతట అదే సడలిపోతుంది. నీ విప్పటికి చంపానగరానికి వెళ్ళిపో! ఒక పక్షం రోజులలో, నయానా భయానా చెప్పి రాగమంజరిని తిరిగి పంపించి వేస్తానులే!"

వేశ్యమాత ఆ మాట వినిపించుకోలేదు:

"స్వామీ! పోనీ, నే నంతవరకూ ఇక్కడే కాలక్షేపం చేస్తాను. సరిగదా!"

"నీ విక్కడ రోజూ కనిపిస్తూంటే ఆమె మరింత బిర్రబిగిసి పోతుందేమోనని నా భయం. ఆ పైన నీ ఇష్టం."

ఆ మాటమీద వృద్ధమాత కొంచెం తమాయించింది:

"స్వామీ! మా ఇంటిల్లిపాదికీ రాగమంజరి ఒక్కత్తే దిక్కు! ఆమె మరి తిరిగిరాకపోతే మేమంతా అన్నానికి కూడా మొహం వాచి పోయి మలమల మాడి చావవలసిందే! అందుచేత మీ రెలాగైనా పంపించి తీరతామని సెలవిస్తే తిరిగి వెళ్ళిపోతాను!"

"అయ్యో వెర్రిదానా! నే నింతకు పూర్వంనించీ చెపుతూనే వున్నాను. రాగమంజరి నా మాట బొత్తిగా చెవికెక్కనీయలేదు. ఏం చెయ్యను? ఇప్పుడైనా మించిపోయిందేమీ లేదు! యథాశక్తిగా ప్రయత్నిస్తాను. ఆపైన అమ్మవారి సంకల్పం ఎలాగుంటే అలాగ జరుగుతుంది. అంతా పరమేశ్వరి అనుగ్రహం!"

ఆ మాటతో ఆ వృద్ధురాలికి కొంచెం ధైర్యం కలిగింది. మళ్ళీ సవినయంగా ఆరుణిమునికి నమస్కరించి చంపానగరానికి బయలుదేరింది.

వెళ్ళబోయే ముందు రాగమంజరిదగ్గిరికి వెళ్ళి ఆమె ననేక విధాల బతిమాలింది. భయపెట్టింది. ఆమె ఎంతకీ వినకపోతే వలవలా విలపిస్తూ అలాగే చంపానగరానికి వెళ్ళిపోయింది.

3

అప్పటికి బాగా పొద్దు వాలింది. ఆనాడు జరిగిన విశేషాలు తలుచుకొన్న కొద్దీ ఆరుణిహృదయం విషాదాంధకారంలో మునిగిపోయింది. సంసారం దుఃఖబహుళం అన్న విషయం అతనికి తిరిగి ఆనాడెవరో వెన్ను చరిచి బోధించినట్లయింది.

అప్పటికప్పుడే అరణ్యంలోని కీచురాళ్ళ మోత బాగా శ్రుతిమించిపోయింది. దూర దూరంగా ఆటవికుల కుటీరాల మంటల వెలుగులలో అరణ్య వృక్షాలు పెనుభూతాల్లా కనిపించాయి.

ఆరుణి శుద్ధశ్రోత్రియకుటుంబంలో జన్మించాడు. అతని కుటుంబంవారంతా నిత్యాగ్నిహోత్రులు; సోమపీథులు. కాని ఆరుణిది చాలా బీద కుటుంబం. అయినా, ఏదో, కలిగిన దానితోనే కాలక్షేపం చేస్తూ ఆ కుటుంబంవారంతా గుట్టుగా కాలం వెళ్ళబుచ్చుకునేవారు. వా రెప్పుడూ 'దేహి' అని ఒకరిదగ్గిర చెయ్యి చాచలేదు.

ఆరుణిచిన్నతనంలో అతని కుటుంబాని కెన్నో విపత్పరంపరలు సంభవించాయి. ముందుగా అతని తండ్రి మహామారి జాడ్యంతో మరణించాడు. ఆ పైన పదిరోజులైనా తిరగకముందే అతని తల్లి కూడా ఆ వ్యాధితోనే దారుణమరణానికి ఆహుతి అయిపోయింది. ఆ భీకర సంఘటనలతో ఆరుణికి సంసారంపై విపరీతమైన విరక్తి కలిగింది. వెంటనే, సన్యసించవలెనని అనుకొన్నాడు.

ఆ విషయం అన్నగారికి తెలియజేశాడు. ఇక కుటుంబాని కంతటికీ ఆయనే పెద్ద. ఆయన కేమనడానికీ పాలుపోలేదు. వివాహం చేసుకొని గృహస్థ ధర్మం అవలంబించడమే న్యాయమని అనేక విధాల చెప్పి చూచాడు. అయినా ఆరుణి వినలేదు.

ఒకనా డెవరితోనూ చెప్పకుండా బయలుదేరాడు. కేవలం కాలి నడకతో కొన్ని వందల యోజనాలు ప్రయాణం చేసి అంగరాజ్యంలో గంగానదీతీరంలో ఉన్న మరీచిమహర్షి ఆశ్రమానికి చేరుకొన్నాడు. అనేక విధాల శుశ్రూషచేసి మరీచి మహర్షి వాత్సల్యం చూరగొన్నాడు.

అనతికాలంలోనే సన్యాసాశ్రమం స్వీకరించాడు. ఆపైన కొంత కాలం మరీచిమహర్షి ఆశ్రమంలోనే తన తపశ్చర్య సాగించాడు. అటు పిమ్మట మరీచిమహర్షి ఆశ్రమానికి కొంతదూరంలో ఉన్న చండీ క్షేత్రంలో తపశ్చర్య కుపక్రమించాడు. అప్పటినించీ దానికి ఆరుణి ఆశ్రమం అనే పేరు చంపానగరం అంతటా మారుమోగింది.

రాగమంజరి వృత్తాంతం తలుచుకొన్న కొద్దీ ఆరుణికి తన చిన్ననాటి విపత్పరంపరలన్నీ జ్ఞాపకం వచ్చాయి. అందుచేతనే రాగమంజరి యెడల అతని కంత జాలికలిగింది.

కాని అటుపిమ్మట ఆ వృద్ధమాత మొర విన్న తరవాత అతని మనస్సులో ఒకవిధమైన డోలాందోళన ప్రారంభమైంది. ఇక వెంటనే రాగమంజరి నెలాగైనా తిరిగి పంపించి వెయ్యడమే మంచి దనుకొన్నాడు.

అయినా, ఆరుణికి, వెనువెంటనే ఆవిషయం రాగమంజరితో ప్రస్తావించడం సముచితం కాదని అనిపించింది.

అలాగలాగ ఒక పక్షంరోజులు గడిచిపోయాయి. ఆ పక్షం రోజుల లోనూ రాగమంజరి ఆశ్రమంలో ఎంతో అనువర్తనగా ప్రవర్తించింది. నిత్యమూ ఆమె చండీ క్షేత్రంలోనే తనకాలం వెళ్ళబుచ్చుతునేది. తెల్ల వారు జామునే లేచి ఎముకలు కొరికివేసే చలిలో గంగానదిలో స్నానం చేసి జపతపాలతో కాలం వెళ్ళబుచ్చేది.

ఆ పదిహేనురోజులూ గడిచిపోగానే వృద్ధమాత ప్రశాంతమైన ఆ ఆశ్రమంలో మళ్ళీ లేనిపోని అలజడి రేకెత్తిస్తుందేమోనని ఆరుణికి కొంచెం భయంవేసింది.

ఆ మరునాడు రాగమంజరి తెల్లవారుజామునే లేచి పరిశుభ్రమైన నారచీర ధరించి ఆరుణికి పాదాభివందనం చేసింది. ఆ ముని ఎంతో వాత్సల్యంతో ఆమె నాశీర్వదించాడు.

"రాగమంజరీ! నీ వాశ్రమానికి వచ్చి అప్పుడే ఒకపక్షం రోజు లయింది. నీ కీ అరణ్యావాసం ఎలాగుంది?"

"స్వామీ! నే నిక్కడకి వచ్చినప్పటినించి ఎన్నడూ ఎరగని మన శ్శాంతి అనుభవిస్తున్నాను."

ఆరుణి ఆమె అలాగ సమాధానం చెప్పగలదని అనుకోలేదు. కొంత సే పేదో ఆలోచించాడు:

"మొట్టమొదట నీ వీ ఆశ్రమంలో కష్టసుఖాల కోర్చుకోలేవేమో నని అనుకున్నాను."

రాగమంజరి ఆ వ్యంగ్యప్రశస్తి విని తల వంచుకుంది:

"అదంతా మీ అనుగ్రహం."

"నాలో ఏమి ఉంది? అదంతా అమ్మవారి అనుగ్రహం."

అన్నా డారుణి. తరవాత అతని కిక ఏమనడానికీ ఏమీ పాలు పోలేదు.

"అది సరేగాని, మీ అమ్మ తిరిగి ఇక్కడికి వచ్చి నిన్నిక్కడినించి తీసుకుపోతుందేమోనని భయపడుతున్నాను."

అని, ఆరుణి, పరిశీలనగా ఆమెవైపు చూచాడు.

"ఏమైనా సరే! నే నిక ఆ నరకకూపంలో ప్రవేశించదలచుకోలేదు. మీకు నేనిక్కడ నివసించడం ఇష్టం లేకపోతే నా నిండుప్రాణా లా గంగాదేవి కర్పించి వేస్తాను. అంతే!"

"తప్పు! తప్పు! అలా గనకూడదు. ఆత్మహత్య మహా పాతకమని ధర్మశాస్త్రవేత్త లుద్ఘోషిస్తున్నారు. అది సరేగాని నీవు తిరిగి వెళ్ళక పోతే మీ కుటుంబం అంతా అన్నవస్త్రాలు కూడా లేక ఆత్మహత్యలకు పాల్పడతారేమో! అప్పు డా మహాపాతకం అంతా నీ మెడకు చుట్టు కుంటుంది. ఆవిషయం ఏమైనా ఆలోచించావా?"

"మీరన్నది నిజమే! అయితే నా కిక ఈ సంసారకూపం నించి విముక్తి లేదా? నే నీ అంధకూపంలోపడి ఇల్లాగే మగ్గిపోవలసిందేనా? ధర్మవేత్తలైన తామే ఇలాగ సెలవిస్తే ఇక నేనేమనగలను!"

ఆమాట కేమని సమాధానం చెప్పాలో ఆరుణికి స్ఫురించలేదు.

"అయితే మీ అమ్మ తిరిగివచ్చినప్పు డాలోచించుకోవచ్చులే!"

అని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. పిమ్మట నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ తన కుటీరంలోకి వెళ్ళిపోయాడు.

4

ఆ తరువాత పిమ్మట క్రమంగా ఒక పక్షం రోజులు గడిచిపోయాయి. అయినా రాగమంజరి తల్లి మరి ఆశ్రమానికి తిరిగి రాలేదు.

ఆమె తిరిగి రాకపోవడంతో ఆరుణి హృదయంలో కొంచెం ఆందోళన బయలుదేరింది. ఆ తరవాతనైనా ఆమె ఎప్పుడో ఒకప్పుడు హఠాత్తుగా ఆశ్రమంలో విరుచుకు పడగలదని, రాగమంజరి నెలాగైనా తిరిగి పంపించ వలసిందని మళ్ళీ కాళ్ళావేళ్ళాపడి గగ్గోలు చెయ్యగలదని అతడు భయపడ్డాడు.

ఆ దృష్టితోనే ఒకనాడు రాగమంజరిని తిరిగి చంపానగరానికి వెళ్ళిపోవలసిందని బలవంతం చేశాడు. కాని ఆమె చెక్కిళ్ళపై జాలు వారిన కన్నీరు పరిశీలించగానే అతనికి కొంచెం జాలివేసింది. ఆమె నంతగా బలవంతం చేసినందుకు లోలోపల బాగా నొచ్చుకున్నాడు.

సంసారంపై విరక్తితో ఒక పతిత స్త్రీ అతని పాదాలాశ్రయించింది. గడచిన పక్షంరోజులనించి ఆరుణి ఆమె ప్రవర్తన చాలా నిశితంగా పరిశీలించాడు. ఆ ప్రవర్తనలో అతని కెక్కడా వేలెత్తి చూపడాని కొస్కారం కనిపించలేదు. బాగా పసివారైనా, అతని శిష్యుల నెన్నడూ ఆమె కన్నెత్తి పలకరించనే లేదు. ఆశ్రమానికి వచ్చినప్పు డామె శరీరం మీద కొన్ని చిన్నచిన్న అలంకారా లుండేవి. ఇప్పు డామె ఆ అలంకారాలన్నీ పూర్తిగా విసర్జించి వేసింది. కేవలం వట్టి నార చీరలతో సన్యాసినీ వేషం ధరించింది. ఎంతటి ఎముకలు కొరికివేసే చలిలోనైనా తన దైనందిన నియమాలు, జపతపాలు విసర్జించలేదు. ఆమె నిష్ఠ చూచి శిష్యులెంతో ఆశ్చర్య పడ్డారు. క్రమక్రమంగా ఆరుణికి కూడా ఆమె నిష్ఠ యెడల గౌరవం కలిగింది.

ఆ విధంగా అత్యంత శ్రద్ధాభక్తులతో తన పాదా లాశ్రయించిన

ఒక పతిత స్త్రీని ఆ విధంగా తిరిగీ సంసార కూపంలోనికి తోసివెయ్యడం కేవలం పాపహేతువు కాగలదని అతని కా క్షణంలో స్ఫురించింది.

చంపానగర వాసులు కొందర ప్పుడప్పు డతనిని సందర్శించిపోయే వారు. అతడు వారి వారి అర్హతల ననుసరించి ధర్మోపదేశాదులు చేస్తూండే వాడు.

అయితే ఇప్పుడతని కొక విషయంలో ఒక పెద్ద ఆశంక పట్టుకుని పీడించింది. ఇంతకు పూర్వం చంపానగర మహిళ లతనిని సందర్శించక పోలేదు. ఆరుణి వారి కేవో ధర్మోపదేశాలు చేసేవాడు. వా రొకటి రెండు రోజు లాశ్రమంలో ఉండి తిరిగి చంపానగరానికి వెళ్లిపోయేవారు.

కాని రాగమంజరి ఆజన్మాంతము ఆశ్రమవాసం చెయ్యాలని నిశ్చయించింది. తనకు మంత్రోపదేశం చెయ్యవలసినదని ప్రార్థించింది. ఆవిధంగా ఆమె కాజన్మాంత దీక్ష ఇచ్చి మంత్రోపదేశం చెయ్యడం సముచితమేనా అని అతని కొక పెద్ద సందేహం బయలుదేరింది.

అతని మనస్సులో ఇంకొక అనుమానం కూడా బయలుదేరింది. ఇన్నాళ్ళనించీ అత డామె యౌవన సౌందర్యాదు లంత శ్రద్ధగా పరిశీలించ లేదు. ఇటీవల ఆమె యౌవన సౌందర్యాలు జాగ్రత్తగా పరిశీలించాడు. ఆమె కింకా పాతిక సంవత్సరాలైనా నిండలేదు. పరిపూర్ణ యౌవనం ఆమెఆకృతిలో అంతటా పరిస్ఫుటంగా స్ఫురించింది. రాగమంజరి అంతటి మహా సౌందర్యవతి కాకపోవచ్చును గాని మొత్తం మీద ఆమె అందగ:త్తెలలో లెక్క.

ఆమె యౌవన సౌందర్యాలు కొంచెం నిశితంగా పరిశీలించగానే ఆరుణికి తన శిష్యులిద్దరివిషయము హఠాత్తుగా స్ఫురించింది. వారిద్దరు వటువులే. వారిలో ఒకడింకా పసివాడే. అతనికింకా పదిపదహారేళ్ళయినా నిండాయో లేదో! రెండవ శిష్యునికి పద్దెనిమిదేళ్ళు నిండాయి. ఆ పరిస్థితులలో వారి కీ స్త్రీసన్నికర్ష అంతగా సముచితం కాదేమోనని అతనికి భయంవేసింది.

ఆరుణికి తన విషయంలో ఆవిధమైన సందేహాని కాస్కారం లేనే లేదని అనిపించింది. అతని కిప్పుడు ఏభై యోపడి దాటిపోవచ్చింది. పైగా

అనేకమైన అసిధారావ్రతాలలో ఆరితేరిన అతని కిది ఒక ప్రశ్నగానే స్ఫురించలేదు. ఎంతసేపూ అతని కా శిష్యుల విషయమే ఒక విషమసంధిలా స్ఫురించింది. అయితే అలాగ ఎన్నాళ్లాలోచించినా అతని కేమి చెయ్యడానికీ మనసొప్పలేదు.

ఒకనాటి ప్రాతఃకాలవేళ, అతడు, తన జపతపాదులు ముగించుకుని, తన కుటీరాని కెదురుగా ఆరవేసిన నారచీరల తీరు పరిశీలిస్తూ కూర్చున్నాడు.

అవి పవిత్ర భాగీరథీజలాలలో పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉతికి ఆరవేసిన మడుగుదోవతులు. గంగానదీ సైకతాలలో మెరిసిపోయే తెల్లని రెల్లుపూ రేకల్లా ఉదికి ఆరవేసిన ఆ మడుగు దోవతులమీద శిశిర ప్రాతఃకాల సూర్యకాంతి ప్రసరించగానే అతని దృష్టి కవి కేవలం కాషాయ వస్త్రాలలా ప్రత్యక్షమైనాయి. ఆ సమయంలో హఠాత్తుగా అతని కొక అభిప్రాయం స్ఫురించింది.

ఎంతటి తెల్లని మడుగు దోవతి అయినా ఎర్ర ఎర్రని లేత ఎండ పడగానే అది కాషాయవస్త్రంలా మారిపోయింది. హృదయం కూడా ఎంత స్వచ్ఛమైనా స్త్రీసాంగత్యంలో అది ఇట్టే రాగరంజితమై పోగలదని అతనికి భయంవేసింది. ఆ సమయంలో శిష్యుల కిక స్త్రీసాంగత్యం క్షేమదాయకం కాదని ఒక నిశ్చయాభిప్రాయం కలిగింది. కాని వెంటనే రాగమంజరి నాశ్రమంనించి పంపించి వెయ్యడానికి మనసొప్పలేదు. అలాగని ఆమె నాశ్రమంలో ఉండనీయడానికీ మనసొప్పలేదు.

ఎప్పుడైనా తపశ్చర్యను గురించిన ధర్మసందేహాలు కలిగినప్పుడు మరీచిమహర్షి సన్నిధిలో ఆ ధర్మసందేహాలు తీర్చుకోవడం అతనికొక పరిపాటి. మరీచి మహర్షి అతనికి సన్యాసాశ్రమదీక్ష ఇచ్చిన మహామహుడు; మహాతపశ్శాలి.

అరుణి ఆ విషయంలో మరీచి మహర్షి నొకమారు సందర్శించవలెనని అనుకొన్నాడు. శిష్యులిద్దరినీ ఆశ్రమ సంరక్షణ కప్పగించి ఆ మరునాడే మరీచి మహర్షి ఆశ్రమానికి బయలుదేరి వెళ్లిపోయాడు.

5

పది పదిహేను క్రోశాల దూరం నడిచి మరీచిమహర్షి ఆశ్రమం చేరుకోగానే ఆరుణి ముని హృదయంలో ఒక విధమైన ప్రశాంతస్థితి ఏర్పడింది. ఆ ఆశ్రమ వటవృక్ష చ్ఛాయలో మరీచిమహర్షి కి సాగిలిపడి అతని సన్నిధిని కూర్చోగానే ఆరుణికి తిరిగీ ఇంకొక వటవృక్షచ్ఛాయలో కూర్చున్నట్టు తోచింది. అతని హృదయంలోని సంశయాలన్నీ ఒక్కమారుగా విచ్ఛిన్నమైనట్టు ఒక అపూర్వానుభూతి కలిగింది.

దట్టంగా అల్లిబిల్లిగా అల్లుకొన్న ఆశ్రమ వృక్షాల గుబురులలో కొంచెం ముస్సుందుగానే సూర్యాస్తమయం అయినట్టు కనబడింది. మరీచి మహర్షి ఆశ్రమంలోని ఉడతలు, పిచుకలు మొదలైన జీవాలు మహర్షికి దగ్గరగానే ఎంతో చనువుగా సంచరిస్తూ ఆడుకొంటున్నాయి. ఆరుణి మరీచికి సాష్టాంగనమస్కారం చేసి కూర్చోగానే ఆ జీవా లతన్ని చూచి కొంచెం బెదిరి దూరంగా పారిపోయాయి. ఒక లేడి కొంచెం దూరంలో నిలబడి అతనివైపు నిశ్చలంగా చూచింది. మరీచి మహర్షి తన కెదురుగా కూర్చున్న వృద్ధతాపసుల కిద్దరికి ధర్మోపదేశం చేస్తున్నాడు. ఆరుణిని చూచినా అత డా ధర్మోపదేశం విరమించలేదు.

"మీరెన్నడయినా వానరవినోదులు అరణ్యాలలో కోతులను పట్టుకొనే తీరులు పరిశీలించారా?"

ఆ ఇద్దరు వృద్ధులు ఆ విషయం ఎన్నడూ పరిశీలించనే లేదన్నట్లాశ్చర్యంగా మహర్షి మహర్షివైపు చూచారు. మళ్ళీ తన ప్రసంగం ప్రారంభించాడు:

"నే నది అంతా వివరిస్తున్నాను. శ్రద్ధగా ఆలకించండి! వానర వినోదులు కోతులు తిరిగే చోట భూమిలో చిన్న చిన్న మూతులున్న కలశాలను స్థాపిస్తారు. ఆ కలశాలలో కోతుల కిష్టమైన కాయలు పడవేసి దూరంగా తొలిగిపోతారు. కోతు లా కాయలకోసం ఆ కలశాలలో చేతులు పెట్టి అవి గట్టిగా పట్టుకొని పైకితీయాలని ప్రయత్నిస్తాయి. కాని ఆ కాయ లిరికించుకొన్న కోతుల పిడికిళ్ళు బాగా పెద్దవై పోతాయి. అవి

ఎంత గిలగిల కొట్టుకున్నా ఆ కలశాలలో చిక్కుకున్న పిడికిళ్ళు పైకి రావు."

ఆ వృత్తాంతం అత్యంత శ్రద్ధగా విని ఆరుణి ఎంతో ఆత్రంగా ప్రశ్నించాడు:

"ఆ కాయ లాకలశాలలోనే విడిచివేస్తే పిడికిళ్ళు సులభంగా పైకి తీసుకోవచ్చును గదా?"

"నిజమే! కోతుల కా జ్ఞానం కలగదు. అవి ఆ కాయ లలాగే పట్టుకుని అతి దీనంగా ఆక్రోశించి ఆక్రోశించి అలిసిపోతాయి. ఆ సమయంలో వానర వినోదులు వాటిని పట్టుకుని బాగా మచ్చిక చేస్తారు."

మరీచిమహర్షి ఆ విషయం ప్రసంగించడానికి కారణమేమో ఆరుణికి తెలియలేదు. అత డలాగే ఆశ్చర్యపోతూ మహర్షి కేసి చూశాడు. మహర్షి మళ్ళీ తన ప్రసంగం ప్రారంభించాడు:

"ఈ సంసార తాపత్రయాల్లో చిక్కుకొన్న దౌర్భాగ్యులు కూడా అలాంటివారే. అలభ్యమైన ఫలాలకోసం ఆ కోతుల ధోరణిలో అంగలారుస్తూ అలాగే అలసిపోయి మృత్యు దంష్ట్రిలలో చిక్కుకొంటారు. అంతేగాని ఆ అలభ్యమైన ఫలాకాంక్షలు విడిచిపెట్టాలని వారికి తెలియదు. ఎంత చెప్పినా వినిపించుకోరు."

ఆ కథ విన్న తరువాత అక్కడ కూర్చున్న వృద్ధతాపసు లిద్దరూ నిట్టూర్చి మహర్షి పాదాలకు నమస్కరించి నెమ్మదిగా అక్కడినించి వెళ్ళిపోయారు.

ఆరుణి కా కథ వినగానే నిత్యమూ తాపత్రయాలలో తలమునక లైపోతూ క్రమంగా మృత్యుదంష్ట్రిలలో పడిపోయే సంసారుల యెడల విపరీతమైన జాలి కలిగింది. వారి యమయాతన లొక్కమారు తలుచుకోగానే అతనికి కళ్ళు కొంచెం చెమ్మగిల్లాయి. ఆ క్షణంతో తన తపశ్చర్యలన్నీ నిలిపివేసి నిత్యదుఃఖితులైన పతితజనుల సముద్ధరణలోనే జీవిత శేషం అంతా గడిపివెయ్యాలని అనిపించింది. అయినా కొంచెం అడకువతో మహర్షికి విన్నవించుకొన్నాడు:

"నాకీ నిత్యదుఃఖితులైన జీవుల యాతనలు తలచుకొన్న కొద్దీ ఇక

ఈ తపశ్చర్య ఇంతటితో విరమించివేసి పరమేశ్వర స్వరూపులైన పతిత జనుల పరిరక్షణలోనే జీవితశేషం యావత్తూ గడిపివెయ్యవలెననే ఉత్కంఠ కలుగుతున్నది.''

అని అలాగే రెప్పవాల్చకుండా మహర్షి ముఖం చూస్తూ కూర్చున్నాడు. ఆమాటతో మహర్షి నుదుటిపై రూక్షంగా బొమముడి విరిగింది. అతడు దురుసుగా ఆరుణిమీద విరుచుకు పడ్డాడు.

''ఈ సముద్ధరణాధికారం నీ కెవరిచ్చారు? ప్రపంచం అంతా సృజించిన ఆ పరమేశ్వరుడే వారి సంరక్షణభారం వహించగలడు. మధ్యన అల్పాల్పుడవు, అజ్ఞుడవు అయిన నీ వెవరవు?''

ఆరుణి ఆ మాట విని తలవంచుకొన్నాడు. అతని కొక నిమిషం వరకు ఏమనడానికీ పాలుపోలేదు. అలాగే తలవంచుకొని వినబడీ వినబడ నట్లు నెమ్మదిగా నసిగాడు:

''అయితే నిత్యదుఃఖితులైన జీవు లాక్రోశిస్తూంటే మనం అంతా తటస్థంగా మాట్లాడ కూరుకోవడం ధర్మమేనా?''

మరీచి మహర్షి ముఖం ఆ ప్రశ్నతో మరింత జేవురించింది:

''మున్ముందు నీ ఆత్మసముద్ధరణ విషయం ఆలోచించుకో! అది జరిగిన తరవాత పతితజనోద్ధరణ విషయం ఆలోచించుకోవచ్చునులే!''

ఆరుణి అంతటితో మాట్లాడ కూరుకోలేదు:

''అయితే అంతవరకూ తటస్థంగా, మాట్లాడ కూరుకోవలసిందేనా? అది కేవలంస్వార్థదృష్టి కాదా?''

మహర్షి ముఖంలో తీవ్రత కొంచెం సడలింది:

''అహంకారావేశం అణిగిపోనంతవరకూ ఈ స్వార్థపరార్థాల నిర్ణయం మిక్కిలి దుష్కరం! అందుచేత మున్ముందు సాధించుకోవలసింది రాగద్వేషాది దమనం!''

అయినా ఆరుణి సందేహం అంతమాత్రంచేత తీరలేదు. అసలీ శంక లన్నీ అతనిహృదయంలో రాగమంజరిని గురించే బయలుదేరాయి. ఇక ఆ విషయం విస్పష్టంగా చెప్పకపోవడం మంచిదికాదని అతడు నిశ్చయించుకొన్నాడు. సంగ్రహంగా మరీచిమహర్షికి రాగమంజరి విషాదగాథ అంతా

తెలియజేశాడు. ఇక మహర్షి ఏవిధంగా ఆజ్ఞాపిస్తే ఆ విధంగానే చెయ్య వలెనని నిశ్చయించుకొన్నాడు. కాని మరీచి మహర్షి ఆ ప్రశ్న కంత విస్పష్టంగా ప్రత్యుత్తరమీయలేదు. ఆరుణి అత్యంత వినయంగా ప్రార్థించిన పిమ్మట చిట్టచివర కొక నిట్టూర్పు విడిచిపెట్టాడు:

"ఆరుణీ! ఈవిషయం నే నేమి నిర్ణయించ గలను? ఇంతకూ ఆమె అర్హత ఎట్టిదో నే నెరగను కదా! ఆమెకు సహజవిరక్తి కలిగినపుడు ధర్మదీక్ష ఇవ్వవచ్చును. అసలు ముమ్ముందు నీ వలవరుచుకోవలిసినది రాగద్వేషరాహిత్యం. అది సిద్ధించినపు డిలాంటి వెన్ని చేసినా అవి నిన్నంట జాలవు."

ఆపైన ఆరుణి ఇక ఏమని ప్రశ్నించగలడు? కొంచెం జిజ్ఞాసా దృష్టితో మళ్ళీ ఏమో ప్రశ్నించబోయాడు. అంతలోనే మహర్షి అక్కడి నించి కదలి వెళ్ళిపోయాడు. ఆరుణి అతని అడుగుల్లో అడుగులు వేసు కుంటూ వెనువెంటనే నడిచి వెళ్ళిపోయాడు. మహర్షి మళ్ళీ నిశితంగా ఆరుణిముఖం పరిశీలించాడు.

"ఆ పరమేశ్వరుని సంకల్పం ఎలాగున్నదో సరిగా ఆవిధంగానే జరిగిపోతుంది. నీకీ అనవసరమైన ఆందోళన ఎందుకు? యద్భావి తద్భవతి!"

అయినా అతని హృదయంలో ఆందోళన మందగించలేదు.

6

ఆరుణి తిరిగి తన ఆశ్రమానికి చేరుకొన్నాడు. అతడు తిరిగి వచ్చేసరి కించుమించు పదిరోజులు పట్టింది.

శిష్యులు, రాగమంజరి ఆరుణి రాకకోసం ఎదురు తెన్నులు చూస్తున్నారు. ఆరుణిని చూడగానే వారందరి ముఖాలూ ఒక్కమారుగా వికసించాయి.

ఆ పది రోజులలోనూ ఆశ్రమంలో కొన్ని కొత్త మార్పులు వచ్చాయి. ఇంతకు పూర్వం శిష్యు లిద్దరు అడివికి వెళ్ళి ఆరుణికి కావలిసిన సమిధలు, కుశలు, ఫలాలు, పుష్పాలు మొదలైనవి తీసుకు వచ్చేవారు.

కాని ఈ మధ్యన రాగమంజరి ఆశ్రమాని కనతిదూరంలో కొన్ని పూలమొక్కలు నాటింది. వాటికి పాదులు చేసింది. పొద్దస్తమానమూ వాటికి నీరుపోసి పెంచడంలోనే నిమగ్నురాలై పోయింది. మిగిలిన కాలంలో ఆమె జపతపాదులలో మునిగిపోయేది. అంతేగాక తన కుటీరమే గాక ఆరుణి కుటీరము, శిష్యుల కుటీరమూ పరిశుభ్రంగా అలికి ముగ్గులు పెట్టేది.

శిష్యుల నామె కన్నతల్లికన్నా ఎక్కువ ఆప్యాయంగా ఆదరించింది.

వారి కామె యెడల కలిగిన మాతృగౌరవ భావం పరిశీలించిన ఆరుణి కాక్షణంలో ఆవిషయంలో అంతకుపూర్వం కలిగిన భయ సందేహాలన్నీ తొలగిపోయాయి.

క్రమ క్రమంగా ఆశ్రమంలో శిశిరర్తువు-చిన్నెలన్నీ అంతరించిపోయాయి. నూతన వసంత ప్రాదుర్భావంతో రాగమంజరి పాదులుచేసి నీరుపోసి పెంచిన పూల మొక్కలన్నీ చిగిర్చి మొగ్గలు దొడిగాయి. అంతే కాదు. ఆ పరిసరారణ్యం అంతా నవవసంత ప్రాదుర్భావంతో ఒక వినూతన స్వరూపం ధరించింది.

ఒకనాటి ఉదయం రాగమంజరి కన్నతల్లిలా కొత్తగా పూచిన పూలకేసి చూస్తూ ఎంతో అమాయికంగా కనిపించింది.

ఆమె అమాయికానందం చూడగానే ఆరుణి కింతకుపూర్వం ఆమెపై కలిగిన అనుమానాలన్నీ మంచు విడిపోయినట్లు విడిపోయాయి.

"ఈమెమూలంగా నా శిష్యుల వేదాధ్యయ నాదులకు, జపతపాదులకు అంతరాయా లేవయినా కలగవచ్చునని ఎంతైనా అనుమానించాను. ఆ అనుమానాలన్నీ నా హృదయ దౌర్బల్యంవల్లనే ఏర్పడ్డాయి. సందేహామేమీ లేదు.

అని తన హృదయదౌర్బల్యానికి కొంచెం కించపడ్డాడు.

అయినా అత డంతవరకు ఆమెకు పూర్తిగా సన్యాసదీక్ష ఇవ్వనే లేదు.

మరీచిమహర్షి చెప్పినట్లు ఆమె అర్హతానర్హతలు పూర్తిగా పరిశీలించిన తరవాతే ఆమెకా సన్యాసదీక్ష ఇవ్వడం సముచిత మని అనుకొన్నాడు.

అయినా మరీచి చేసిన హెచ్చరిక లతని హృదయంలో చండీ దేవాలయ ఘంటలలా మారుమోగడం మొదలుపెట్టాయి. మరీచి మహర్షి ముందుగా చిత్తశుద్ధి, రాగద్వేష రాహిత్యము అలవరుచుకో వలసిందని నొక్కి నొక్కి చెప్పాడు. అహంకారావేశం అణిగిపోనంతవరకు ధర్మాధర్మనిర్ణయం చాలా క్లిష్టమని ఆదేశించాడు. ఎన్నిమారులు నొక్కి నొక్కి అడిగినా రాగమంజరికి ధర్మదీక్ష ఇవ్వవచ్చునని కాని, ఇవ్వకూడదని కాని నిష్కర్షగా తేల్చి చెప్పలేదు. ఆరుణి అంతటితో విడిచిపెట్టలేదు. ఇంకా నొక్కి నొక్కి అడిగాడు. అయినా మహర్షి ఆ విషయం తేల్చి చెప్పలేదు. పరమేశ్వర సంకల్పం ఏవిధంగా ఉంటే ఆ విధంగానే సర్వమూ జరిగిపోగలదని అన్నాడు. ఆ విషయంలో ఆందోళన పడడం అనవసరమని చెప్పి ఆ ప్రస్తావన అంతటితో ముగించివేశాడు.

మహర్షి ఆ విషయంలో ఇచ్చిన ఉపదేశం ఆరుణికి అంతగా రుచించలేదు. ఒకవ్యక్తి తనకు రాగద్వేష రాహిత్యం సిద్ధించేవరకూ నిత్య దుఃఖితులైన జీవుల యమయాతనలన్నీ తటస్థంగా, తనకు పట్టనట్టుగా చూస్తూ ఊరుకోవలసిందేనా?

అదీగాక ఒకవ్యక్తి తన కాత్మపరిశుద్ధి కలిగినదో లేదో నిర్ణయించుకోవడ మెలాగ?

ఆరుణికి తన చిత్తశుద్ధి విషయంలో ఎన్నడూ అణుమంతైనా సందేహం కలగలేదు. పైగా పరమేశ్వర స్వరూపులైన పతితజీవుల సముద్ధరణమే తన ముఖ్యధర్మమని, ఆ ధర్మ నిర్వహణలో వెనకంజ వెయ్యడం మహాపాతకహేతువు కాగలదనీ అనుకొన్నాడు.

అయినా అతడు రాగమంజరికి పరిపూర్ణ ధర్మదీక్ష ఇవ్వడంలో తొందరపడలేదు.

రాగమంజరికూడా ఆ విషయంలో అతని నేమీ బలవంతం చెయ్య లేదు. అన్ని విషయాలలోను అతని ఆజ్ఞప్రకారమే ప్రవర్తించింది. అతడే తన కిక శరణ్యమని నమ్మింది.

అలాగలాగ వసంతం గడిచిపోయింది. క్రమక్రమంగా గ్రీష్మం కూడా గడిచిపోయింది. ప్రచండ గ్రీష్మంలోకూడా జపతపాదులలో రాగమంజరిభక్తిశ్రద్ధలు పరిశీలించిన ఆరుణి కిక ఆమెను పరీక్షించడం కేవలం అన్యాయమే అని తోచింది.

ఆ మరునాడే ఆమెకు పరిపూర్ణదీక్ష ఇచ్చాడు.

రాగమంజరి అతని అపార వాత్సల్యాని కెంతో సంతోషించి సాష్టాంగనమస్కారం చేసింది. వేడి వేడి కన్నీటితో ఆరుణిముని పాదాలు తడిపివేసింది.

ఆమె శ్రద్ధాభక్తులు పరిశీలించిన ఆరుణి కెంత ప్రయత్నించినా కనుగొలుకులలో కన్నీటిబిందువులు నిలవలేదు. అవి నెమ్మది నెమ్మదిగా అతని చెక్కిళ్ళపై దిగజారాయి.

7

వర్షాకాలం ప్రవేశించగానే ఆరుణి ఆశ్రమంలో అంతటా నవనవోన్మేషం నన లెత్తింది. మోడులైపోయిన ఆశ్రమవృక్షాలన్నీ చల్లచల్లని జల్లు లలో తలలూగిస్తూ నృత్యాలు చేశాయి.

ఆరుణి ఆనాటి ఉదయం నిశ్చలధ్యాననిష్ఠలో నిమగ్నుడై వ్యాఘ్రా జినం మీద మలిచిన స్వర్ణ ప్రతిమలా కూర్చున్నాడు.

అంతలో దూరదూరంగా ఒక నల్లనల్లని పిల్లమబ్బు ఆకాశంలో అంతటా ఆక్రమించడం మొదలు పెట్టింది. కొంతసేపటికి గంగానదీ తరంగ సంగీతంతో కలిసిన చల్లచల్లని పిల్ల తెమ్మెర లాశ్రమ లతల తల లూగించాయి.

కారు మబ్బు లింకా ఆకాశం అంతా ఆక్రమించుకోలేదు. చెట్ల కొమ్మలలోనించి బయటపడిన ఎర్రఎర్రని సూర్యకిరణా లారుణి శరీరం మీద, వ్యాఘ్రాజినం మీద ప్రసరించాయి.

తెరలు తెరలుగా గాలి వీచింది. తెరలు తెరలుగా ఆశ్రమం అంతా చల్లచల్లని జల్లులు పడ్డాయి. అయినా అవి ఆరుణి ధ్యాననిష్ఠ కేమీ భంగం కలిగించలేదు. అతడలాగే నిశ్చలంగా ధ్యానించాడు. మళ్ళీ ఒక నిమిషంలో ఇంకొక పెద్ద జల్లు పడింది.

ఆరుణి తన ధ్యానం అంతటితో కొంచెం చాలించి నెమ్మదిగా కళ్లు తెరిచాడు. ఎదురుగా ఆకాశంలో కొంత మేర కారుమబ్బులు కమ్ముకున్నాయి. కాని ఆశ్రమంలో ఎండపొడలింకా అలాగే నిలిచి ఉన్నాయి. మధ్యన మధ్యన మేఘాల కదలికలో అవి ఒక క్షణకాలంపాటు అదృశ్యమై అంతలోనే మళ్ళీ కళ్ళకు మిరుమిట్లు గొలుపుతున్నాయి.

అతని కెదురుగా కొంతదూరంలో రాగమంజరి పూలమొక్కలకు నీళ్ళుపోస్తూ నిలబడింది. అప్పుడప్పుడు చిన్న చిన్న జల్లులు పడినా ఆమె అవి లెక్కచేయకుండా అలాగే ఆ పూలమొక్కలకు నీళ్ళుపోస్తూ వనలక్ష్మిలా మెరిసింది.

ఆ సమయంలో ఆరుణి హృదయంలో కూడా అదేభావం స్ఫురించింది. ఒక నిమిషం ఆ భావన అతని హృదయంలో వర్షాకాల మయూరంలా పురివిప్పి ఆడింది. అంతలో దూర దూరంగా అతనికి పురివిప్పి ఒయ్యారంగా నృత్యంచేసే రంగు రంగుల నెమలి కేక వినిపించింది. క్షణకాలం అతని దృష్టి అటువైపు తిరిగింది. ప్రాతఃకాల సూర్య కాంతిలో ధగద్ధగాయమానంగా మెరిసిపోయే ఆ నెమలిపింఛం చూడగానే అతనికి రాగమంజరి మనోహరాకృతి మళ్ళీ స్ఫురణకు వచ్చింది. తిరిగీ అతని దృష్టి రాగమంజరి ముఖంపై నృత్యంచేసే ముంగురులవైపు తిరిగింది.

అలాగే ఎంతో ఆప్యాయంగా పూలమొక్కలకు నీళ్ళుపోసే ఆమె ముంగురులపై లేత లేత సూర్యకిరణాలు ప్రసరించాయి.

ఆ సమయంలో ఆమె అతనికి అచ్చంగా పురివిప్పి ఆడే నెమలిలాగే కనిపించింది. క్షణకాలం అతని దృష్టి ఆమె ముంగురులలో చిక్కుపడిపోయింది.

హఠాత్తుగా అతడు తన మనస్సు నిగ్రహించుకొన్నాడు. తన

హృదయంలో అటువంటి భావన కలిగినందు కెంతైనా పశ్చాత్తాప పడ్డాడు.

ఇంతకు పూర్వం ఆమెవల్ల తన శిష్యుల ఏకాగ్రత కేమైనా భంగం కలగవచ్చునని ఆరుణి కొంచెం భయపడ్డాడు. కాని ఇప్పు డతని హృదయమే చలించింది. అది తలుచుకోగానే అతని శరీరం జుగుప్సతో జలదరించింది.

“నా శిష్యుల నిష్ఠ కేమైనా భంగం కలగవచ్చు ననుకొన్నాను గాని చివరి కీమె నానిష్ఠకే భంగం కలిగించిందే!”

అని తన మనోదౌర్బల్యాని కెంతైనా మథనపడ్డాడు. మళ్ళీ మనస్సు నిలవరించుకొని చండీదేవి నొకమారు మనసారా ధ్యానించుకొన్నాడు. యథాప్రకారం ధ్యాననిష్ఠలో పడ్డాడు. దృష్టి నాసాగ్రం మీదికి మళ్ళించాడు. కాని అతని ఏకాగ్ర దృష్టి కెదురుగా రాగమంజరి సుందర నాసిక మాత్రమే ప్రత్యక్షమైంది. అతడు తన యావచ్ఛక్తీ వినియోగించి, కొంతసేపటి వరకు ప్రాణాయామం చేసి తిరిగీ ధ్యాననిష్ఠలో ప్రవేశించాడు. ఈ మా రతని ధ్యాననిష్ఠ ఎక్కడా చెక్కు చెదరకుండా నిశ్చల దీప కళికలా నిలిచింది.

8

అటుపిమ్మట వారం పదిరోజులు గడిచిపోయాయి. క్రమ క్రమంగా ఆరుణి ధ్యాననిష్ఠలో బిగువు సడిలిపోయింది. ఎంత ప్రయత్నించినా అతని కా దృఢనిష్ఠ తిరిగి సాధ్యపడలేదు.

దానితో అతనికి తన జీవితంమీద, తన దౌర్బల్యంమీద విపరీతమైన అసహ్యం కలిగింది. ఆరుణి ఏభైయోపడి దాటిపోవచ్చింది. ఇన్నాళ్ళనించీ కఠినమైన అసిధారావ్రతా లెన్నో అవలంబించి కృతకృత్యుడనయినా నని అనుకొన్నాడు.

అత డాజన్మబ్రహ్మచారి. ఎన్నడూ అతని మన స్సింతగా దుర్బలమై నీరసించిపోలేదు. తన నీచ దౌర్బల్యం తలచుకుంటే అతనికి నిలుచున్న పాటుగా గంగానదిలో ఉరికి ప్రాణ పరిత్యాగం చెయ్యాలని అనిపించింది. ఇక మరి అంతకన్న గత్యంతరం లేదని అనిపించింది.

ఆ సాయంత్రమే తిన్నగా గంగానదికి బయలుదేరాడు. దారిలో అతనికి చండీ దేవాలయ శిఖరం ఎదురుపడింది. వెంటనే లోపలికి వెళ్ళి ఆ దేవత పాదాలపై వాలిపోయాడు.

"తల్లీ! బాల్యం నించి నీ పాదపద్మా లాశ్రయించాను. అచిర కాలంలోనే నీ దివ్యస్వరూపం కళ్ళారా సాక్షాత్కరింప జేసుకోగలనని ఆనందించాను. కాని ఇంతలోనే న న్నీవిధంగా ఈ మాయా మోహ జాలంలో కూలద్రోయడం నీకు న్యాయమేనా?"

అని ఆ దేవత పాదపద్మాలపై నిశ్చలంగా దృష్టి నిలుపుకొన్నాడు. క్షణకాలం పా టతని మన స్సాదేవి పాదపద్మాలలో లీనమైపోయింది.

అతని కా పాదా లేదో దివ్య తేజస్సుతో తళతళా మెరిసిపోతున్నట్లు స్ఫురించాయి. అవి శిలామూర్తి పాదాలలా కనిపించలేదు. ఎవరో దేవతామూర్తి పాదపద్మాలలా మెరుస్తూ అతని కళ్ళలో వెలుగులు విరజిమ్మాయి.

అతడు చండీదేవి స్వయంగా సాక్షాత్కరించిం దని అనుకొన్నాడు. కళ్ళెత్తి నఖ శిఖపర్యంతమూ ఆ దేవిమూర్తి తిలకించాడు. కాని అవి చండీదేవీ స్వరూపం కానేకాదు. అది చిరునవ్వుల పువ్వులు చిలకరించే రాగమంజరి మనోజ్ఞమూర్తి!

దేవీస్వరూపం ఆ విధంగా తన కళ్ళ కెదురుగా స్ఫురించగానే అతని హృదయం పశ్చాత్తాపాగ్నిలో పడి దగ్ధమై పోయింది! దేవిపాదాలపై వాలిన క్షణంలో కూడా అతని హృదయంలో రాగమంజరి సౌందర్యమే సాక్షాత్కరించింది! 'నా హృదయం ఎంతగా పాపపంకిలమై పోయింది!' అని ఒక క్షణకాలం అత డలాగే నిర్ఘాంతపోయాడు.

ఉత్తర క్షణంలో నాలుగైదు మారు లా దేవి శిలాపాదాలపై తల బద్దలు కొట్టుకున్నాడు. ఆ తీవ్రాఘాతాలతో అతని నుదురు బాగా బొప్పి కట్టింది. క్షణకాలంపా టతనికి ఒంటిమీద స్పృహే తప్పి పోయింది.

స్పృహ రాగానే ఆరుణి మనస్సు బాగా కుదటబడింది. అత డొక గడియ వరకు దేవీ పాద ధ్యానంలోనే మునిగి పోయాడు.

ఆ ధ్యానంలో అతని కేవిధమైన మనశ్చాంచల్యమూ కలగలేదు. అత డలాగే మరొక అరగడియవరకు నిశ్చలంగా ధ్యానించాడు. అయినా అతని మన స్సలాగే నిశ్చల దీపకళికలా నిలబడింది.

ఆ సాధనతో అతని కెంతో ధైర్యం కలిగింది. అదే క్షణంలో అతని కొక నిశ్చల సంకల్పం కలిగింది. ఆ సంకల్పం తనకు దేవి అపార కరుణ వల్లనే కలిగినదని అత డనుకొన్నాడు. దేవి తన్ను విడనాడలేదని తన మనో దౌర్బల్యం పూర్తిగా నిర్మూలించి వెయ్యడానికే ఆ విధమైన అగ్నిపరీక్ష చేసినదని అనుకొన్నాడు.

తరవాత ప్రశాంత హృదయంతో చిరునవ్వులు చిలకరిస్తూ నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ తన కుటీరంలోనికి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి అతనికి గాఢంగా నిద్ర పట్టింది. ఆ మరునాడు నిద్ర లేవగానే తన దృఢ సంకల్పం ప్రకారమే నడుచుకోవాలని నిశ్చయించుకొన్నాడు.

9

దేవాలయంలోనికి వెళ్ళక పూర్వం అతని కొక సంకల్పం కలిగింది. ఆరుణి మొట్టమొదటి ఆవేశంలో గంగలోపడి ప్రాణత్యాగం చెయ్య వలెననే అనుకొన్నాడు. చండీ దేవాలయ శిఖరం చూడగానే ఆత్మహత్య మహాపాతక హేతువనీ, అంతకన్న రాగమంజరినే ఏదో మిష పెట్టి ఆశ్రమం నించి పంపించివెయ్యడమే మంచిదనీ అనిపించింది. కాని దేవాలయంలో ఒక గడియసేపు ధ్యానం చేసిన పిమ్మట ఆ సంకల్పంకూడా అతని కంత సముచితంగా కనిపించలేదు.

కామినీకాంచనాలకు దూరదూరంగా పారిపోయి అరణ్యంలో ముక్కు మూసుకుని కూర్చున్నవారందరూ తాము జితేంద్రియులమైనామని మురిసిపోతారు. కాని కించిత్తు కామినీకాంచన సంపర్కం కలిగేసరికి వారి హృదయాలన్నీ తామరాకుమీది నీటిబిందువుల వతుగా చలించిపోవచ్చును. అందుచేత కామినీకాంచనాలకు దూరదూరంగా పారిపోకుండా వాటి సన్నిధిని నిగ్రహం అవలంబించినప్పుడే అది నిజమైన మనోనిగ్రహం అని పించుకుంటుంది. కనకనే రాగమంజరివంటి దిక్కులేని పతితవనితను తిరిగి చంపానగరానికి పంపించివేస్తేమాత్రం ప్రయోజనమేమిటి? ఆమె సన్నిధి లోనే దృఢమైన ఆత్మనిగ్రహం అవలంబించి ఉరకలు వేసుకుంటూ మున్ముందు కురికే ఇంద్రియాశ్వాలను నిగ్రహించాలి. అప్పుడే సముచితమైన

ఇంద్రియ నిగ్రహం అలవడగలదు. ఆత్మ నిగ్రహం లేనినాడు రాగమంజరిని పంపించివేస్తేమాత్రం ప్రయోజన మేమిటి?

అరుణిసంకల్పం క్రమక్రమంగా ఆ విధంగా రూపుదాల్చింది.

ఆనాటి సాయంకాలం రాగమంజరి అతని సన్నిధికి వచ్చికూర్చుంది. అరుణి చూచీ చూడనట్టుగా ఆమెవైపు చూచాడు. అతనిలో పశ్చాత్తాపాగ్ని మళ్ళీ ప్రజ్వలించింది.

"వల్లమాలిన సంసారవిరక్తితో ఒక పతితవనిత 'మరి వేరే దిక్కు లే'దని నా పాదా లాశ్రయించింది. శాయశక్తులా నియమాలు, నిష్ఠలు అవలంబించింది. ఆమె ప్రవర్తనలో అణుమాత్రమైనా లోపం కనిపించలేదు. అయినా నేను ఆమె నాశ్రమంనించి పంపించివెయ్యవలెనని సంకల్పించాను. కేవలం అది నా మనస్సులో ఉదయించిన మనోదౌర్బల్యం కాక మరేమిటి?"

అని కొంచెం పరిశీలనగా ఆమెవైపు చూచాడు. రాగమంజరి కొంతసే పారుణివైపు చూచి వెంటనే తలవంచుకొని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టింది. ఆరుణి కామె మనో వైకల్యానికి కారణం తెలియలేదు.

"ఏమమ్మా, ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లున్నావే!"

"ఏమీ లేదు. నా కీవేళ ఉదయమే ఒక పీడకల వచ్చింది. అది తలుచుకుంటే నా కిప్పటికీ భయంగానే ఉంది."

"అమ్మవారిని తలుచుకుంటే అన్ని పీడకలలూ హరించిపోతాయి! అయినా ఏమా పీడకల?"

"నావంటి పతిత లాశ్రమంలో ఉండడం సముచితం కాదని తాము న న్నీ ఆశ్రమాన్నించి తిరిగీ చంపానగరానికి పంపించి వేశారట! నిర్దాక్షిణ్యంగా తిరిగి ఆ నరకకూపంలో తోసివేశారట. అదీ నాకు వచ్చిన కల. అది తలుచుకున్న కొద్దీ నాకేమో భయంగా ఉంది!"

"నీ కలాంటి కల ఎందుకు వచ్చింది? శిష్యులేమైనా అలాంటి మాట లనుకొన్నారా?"

"అవును. వారిద్దరి ప్రసంగం నాకు కొంచెం చూచాయగా వినిపించింది. నాలాంటి వారికి ధర్మదీక్ష ఇవ్వడం సముచితం కాదని వా రొకనాడు ప్రసంగించుకుంటూంటే నా చెవిని పడింది."

"ఎన్నాళ్ళ క్రితం?"

"నే నీ ఆశ్రమానికి వచ్చిన కొత్తలో!"

ఆరుణి కలకల నవ్వాడు.

"దానికా నీ వింతగా భయపడుతున్నది! ఇప్పుడు నీ కలాంటి భయ మేమీ లేదులే."

అని ఆరుణి ఆమె నెంతో ఆప్యాయంగా ఓదార్చాడు.

ఆ ఓదార్పు మాటలు వినగానే రాగమంజరి కనుగొలుకులలో రెండు చిన్న చిన్న కన్నీటి బిందువులు నిలిచాయి. ఆమె గొంతుక కొంచెం సవరించుకుంది:

"స్వామీ! ప్రపంచంలో సమస్తమూ క్షణభంగురమే కదా! యౌవ నము, భాగ్యభోగాలు, సౌందర్యము, అన్నీ మరు మరీచికలలాగే క్షణంలో నశించిపోతున్నాయే! అయినా ఈ జీవు లీ సంసార వ్యామోహంలో పడి తల మునకలై పోవడానికి కారణ మేమిటి?"

ఆమె వైరాగ్య ప్రసంగం ఆలకించగానే ఆరుణి కెవరో హఠాత్తుగా వీపుపై చరిచినట్లయింది.

తన హృదయంలో ఇన్నాళ్ళనించీ రేగిన ఆందోళన ఆమె పసిగట్టి వేసిందేమోనని మొట్టమొదటగా అతనికి కొంచెం అనుమానం వేసింది. ఆరుణి అలాగే నిశ్చలంగా ఆమె ముఖవైఖరి పరిశీలించాడు. ఆ ధోరణి కొంచెం గమనించగానే అతని అనుమానం క్రమక్రమంగా పటాపంచలై పోయింది.

"కేవలం నా నీడ చూచే నే నీవిధంగా భయపడుతున్నాను."

ఆరుణి తనలోతానే నవ్వుకొన్నాడు.

"రాగమంజరీ! దీనిలో ఇంతగా ఆలోచించవలసిందేముంది? అంతా ఆ జగజ్జనని మాయ! హరిహర బ్రహ్మాదులుకూడా ఆ మాయా వాగురలో నించి తప్పించుకొని బయటపడలేరు!"

అని ఒక్క చిన్న నవ్వు నవ్వాడు. రాగమంజరి ఆ మాట విని బాగా తలవంచివేసింది. అయినా ఆమె చెక్కిళ్ళు ఎర్రబడిన విషయం ఆరుణి గ్రహించాడు. రాగమంజరి అలాగే తలవంచుకుని మళ్ళీ అడిగింది.

"స్వామీ, స్త్రీలకు మరి మోక్షాధికారం లేదా?"

"లేకేమి?"

"అయితే, ధర్మశాస్త్రజ్ఞులు వారికి సన్యాసాధికారం ఎందుకు కలిగించలేదు?"

"సామాన్యంగా స్త్రీలకు సన్యాసాధికారం లేనిమాట నిజమే! అయితే అర్హతానర్హతలను బట్టి వారికి సన్యాసదీక్ష ఇవ్వవచ్చునని ఆచార్యు లాదేశించారు."

తరవాత రాగమంజరి తల ఎత్తి ఆరుణివైపు చూచింది: "స్వామీ! నేను సమస్తము పరిత్యజించి మీ పాదా లాశ్రయించాను. నన్ను తిరిగి ఆ నరక కూపంలో పడదోయకండి!"

అని అతని రెండు పాదాలూ గట్టిగా పట్టుకుంది. ఆరుణి తన పాదాలు దూరంగా తొలగించివెయ్యాలని అనుకున్నాడు గాని ఆమె గట్టిగా పట్టుకోవడంవల్ల అది సాధ్యపడలేదు.

"అమ్మా! నీ వనవసరంగా భయపడుతున్నావు. నేను తిరిగి నిన్నా నరకకూపంలో తోసివెయ్యదలుచుకోలేదు. నా మాట నమ్ము."

అని అనేకవిధాలుగా ఆమె నోదార్చాడు. తరవాత రాగమంజరి నెమ్మది నెమ్మదిగా అతని పాదాలొత్తడం మొదలుపెట్టింది.

"స్వామీ! నా వంటి దీనురాలిని మీరు కాక ఇంకెవ రుద్ధరించ గలరు?"

అని ఎంతో జాలిగా, కేవలం పసిపాపలా అతనివైపు చూచి ప్రాధేయపడింది.

అలాటి భయమేమీ లేదని ఆరుణి మళ్ళీ ఆమెకు గట్టిగా ధైర్యం చెప్పాడు.

మృదువైన ఆమెహస్తం పాదాలమీద పడగానే అతని హృదయం కొంచెం జలదరించింది. అతడు కళ్ళు మూసుకుని చండీదేవతా ధ్యానంలో పడ్డాడు. అలాంటి ఘట్టంలో నిశ్చలధ్యానం సాధించినప్పుడే సరియైన ఇంద్రియనిగ్రహం అలవడగలదని ఆరుణి కా క్షణంలో మళ్ళీ జ్ఞాపకం వచ్చింది.

ఆమె అలాగే కాళ్ళుపట్టినా అతని ధ్యానం ఎక్కడా చెక్కు చెదర లేదు. క్రమంగా ఇంద్రియాశ్వాలన్నీ బాగా లొంగిపోయాయని గుర్తించిన ఆరుణి ఆ క్షణంలో తన ఘన విజయానికెంతైనా సంతోషించాడు!

10

"అయ్యయ్యో! నే నీ సుడిగుండంలో పడి మునిగి పోతున్నాను! రక్షించండి! రక్షించండి!"

అని ఒక ఆర్తనాదం గంగా తీరంలో హృదయవిదారకంగా మారు మోగింది.

అప్పటి కింకా బాగా తెల్లవారలేదు. కొంచెం చీకటిగానే ఉంది. ఆపైన ఆకాశం అంతటా కారుమబ్బులు కమ్ముకొన్నాయి. వర్షం కురిసీ కురవనట్టు కురుస్తూంది. ఈదర గాలి వీచి గంగానదీతరంగా లువ్వెత్తుగా పొంగుతున్నాయి. మళ్ళీ ఆర్తనాదం మరింత హృదయవిదారకంగా వినిపించింది. అది క్రమక్రమంగా మునిగిపోతున్నట్టు ధ్వనించింది.

ఆ దారుణాక్రందనధ్వనితో గంగానదీ సైకతంలో పద్మాసనాసీనుడై నిశ్చలంగా ధ్యానిస్తున్న ఆరుణికి హఠాత్తుగా ధ్యానభంగమయింది. అత డొక్కమారు కళ్ళు తెరిచి అటువైపు చూచాడు. క్షణంలో అదంతా అతనికి అవగాహన అయిపోయింది.

రాగమంజరి కూడా తెల్లవారుజామునే లేచి గంగా నదిలో స్నానం చేసి జపతపాల కుపక్రమిస్తూ ఉంటుంది. అయితే ఆమె స్నానం చేసే ఘట్టం అతడు స్నానం చేసే ఘట్టానికి కొంచెం దూరం. ఆమె ఏదో పెద్ద ఆపత్తులో చిక్కుకొని ఉండవచ్చు నని ఊహించడాని కతని కొక క్షణం కూడా పట్టలేదు. ఆ ప్రాంతంలో అప్పుడప్పుడు మొసళ్ళు మొదలైన క్రూర జలచరాలు కూడా మసులుతూ వుంటాయి. వాటిమూలంగా ఆమె కేదైనా ఆపద సంభవించిఉండవచ్చు నని క్షణంలో అతని కింకొక ఊహ స్ఫురించింది.

వెంటనే అత డక్కడికి పరిగెత్తాడు. ఆ ప్రాంతం అంతా జాగ్రత్తగా పరిశీలించాడు. ఎక్కడా ఆమె జాడ కనిపించలేదు. ఇంకా బాగా

కథా నిలయం
2099
శ్రీకాకుళం

నదీగర్భంలోకి చొచ్చుకు పోయాడు. రెండు మూడు నిమిషాలా ప్రాంతం కొంత వరకు గాలించాడు.

అదృష్టవశాత్తూ ఒక్క చోట ఆమె శరీరం చేతికి తగిలింది. అక్కడ అంత లోతుగా లేదు. వెంటనే అతడామెను రెండు చేతులతోనూ గట్టిగా పొదివి పట్టుకున్నాడు.

రాగమంజరి గాఢంగా కౌగలించుకుని శక్తి కొద్దీ అతన్ని గట్టిగా పట్టుకుంది. నీటిలో నించి నెమ్మదిగా ఒడ్డుకు తీసుకు వచ్చేదాకా ఆమె శరీరం అతని కంతగా భార మనిపించలేదు.

అప్పటికి కొంచెం తెల్లవారింది. అతని కామె అర్ధనగ్నంగా ఉన్నట్టు కనిపించింది. రాగమంజరి కింకా స్పృహ వచ్చినట్లు కనబడలేదు. అతడే ఆమె శరీరానికి ఆచ్ఛాదన కల్పించాడు. రాగమంజరికి తెలివి వచ్చేదాకా కొంచెంసే పలాగే ఆమె పక్కనే కూర్చున్నాడు.

క్రమంగా కొంతసేపటికి రాగమంజరికి తెలివి వచ్చింది. తన పరిస్థితికి బాగా సిగ్గుపడి, ఆమె, తడిసి ముద్దఅయిపోయిన నారచీరతో ఒళ్ళంతా కప్పుకుంది. అయినా ఆమెకు శరీరం అంతా అర్ధనగ్నంగా ఉన్నట్లే కనబడింది. రాగమంజరి ముఖం వల్లమాలిన సిగ్గుతో చిమిడిపోయింది.

ఆరుణి అనేక విధాలుగా ఆమె నోదార్చాడు. రాగమంజరి అతని బుజం ఆనుకుని నెమ్మదిగా లేచి నిలబడింది. అలాగే అతని ఆసరాతో నెమ్మదినెమ్మదిగా నడక సాగించింది.

ఆరుణి ఆమెధోరణి జాగ్రత్తగా పరిశీలించాడు. ఆమె ఇంకా మగత నిద్రలో నడుస్తున్నట్లే కనబడింది. అతని ఓదార్పు మాటల కామె సరియైన ప్రత్యుత్తరా లివ్వలేదు. వారిద్దరు అలా పది బారల మేర నడక సాగించారు.

అంతలోనే ఆమె హఠాత్తుగా అతన్ని గాఢంగా కౌగలించుకుంది.

"అయ్యబాబోయ్!మునిగిపోతున్నాను! మునిగిపోతున్నాను! రక్షించండి! రక్షించండి !" అని గట్టిగా కేకలు పెట్టింది. ఆమె హఠాదాలింగనాఘాతానికి తట్టుకోలేక అతడు గంగాసైకతంలో కూలబడి పోవలసిందే! కాని పడిపోకుండా అతి కష్టంమీద కాళ్ళు గట్టిగా నిలవ

దొరుక్కుతున్నాడు. ఆమె కింకా పూర్తిగా తెలివి రాలేదని క్షణంలో గ్రహించివేశాడు. ఆమె నలాగే గట్టిగా అదిమి పట్టుకొని నెమ్మదిగా ఓదార్చడం మొదలు పెట్టాడు. కాని అతని నోట మాట లంత తేలికగా వెలువడ లేదు.

అర్ధనగ్నమైన ఆమెశరీర గాఢాలింగనంతో నఖశిఖపర్యంతము విద్యుదాఘాతం సోకినట్లయి అతని ఒళ్ళంతా జలదరించింది.

అగరు ధూమవాసన తలకెక్కినట్లతని మనస్సులో అంతటా మైకం కమ్మింది.

వారిద్దరు అలాగే నడుస్తూ ఆమె నివసించే కుటీరం సమీపించారు. ఆ తరువాత ఆమె కుటీరంలోకి వెళ్ళి మెత్తని వ్యాఘ్రాజినం మీద మేను వాల్చింది.

ఆరుణి శిష్యుల కప్పటికి జరిగిన గాథ అంతా తెలిసింది. కొంచెం స్వస్థతకలిగేవరకు వారు కొంతసే పామె కుటీరంలోనే ఉండి జాగ్రత్తగా పరిచర్యలు చేశారు. తరవాత ఆమెకు బాగా తెలివి వచ్చింది. అయినా ఆమె అప్పుడప్పుడు చెరుపు మరుపుగా మాట్లాడడం మానలేదు. వా రా విషయం వెంటనే ఆరుణికి తెలియజేశారు.

ఆరుణి కామె పరిస్థితి తలుచుకుంటే అదంతా ఒక పెద్ద విషమ సంధిలా కనబడింది.

ఇంతకీ గంగా నదిలో ఆమె కేవిధమైన ఆపద వచ్చిందో అతనికి బోధపడలేదు. బహుశః కొంచెం కాలు జారి ప్రవాహవేగంలో పడి కొట్టుకు పోతూ భయపడి ఆ విధంగా కేకలుపెట్టి ఉండవచ్చు నని అత డూహించాడు. అంతేగాని ఆ విషయాలేవీ ఆమె తిన్నగా చెప్పలేక పోయింది. ఆ భయోద్వేగంలో ఆమెకు తాత్కాలికంగా కొంత మనశ్చాంచల్యం కలిగి ఉండవచ్చు నని అత డూహించాడు.

ఆ మరునా డామె పరిస్థితి కొంచెం బాగుపడింది. కాని మనశ్చాంచల్యంలో అంతగా మార్పేమీ లేదని శిష్యు లాచార్యునికి తెలియజేశారు. ఆరుణి ఆ మాట విని బాగా ఆందోళన పడ్డాడు.

11

ఆ వేళ సాయంత్రం ఆరుణి రాగమంజరి పరిస్థితి పరిశీలించడాని కామె కుటీరానికి వెళ్ళాడు. కుటీరంలో ఒకమూల మినుకు మినుకు మంటూ గారకాయనూనె దీపం వెలుగుతూంది. ఆరుణి క్షణకాలం ఆమెపరిస్థితి పరిశీలించాడు.

చెదురుచెదురుగా ఆకాశం అంతటా అలముకొన్న నల్లని మబ్బు లలాగలా కరిగి కరిగి వానజల్లులుగా మారిపోయాయి. అంతలోనే అవి పెద్ద వానగా వినిపించాయి.

ఆరుణి లోపలికి వచ్చిన అలికిడి విని రాగమంజరి నెమ్మదిగా నీరసంగా కళ్ళు తెరిచింది.

"నీ వంట్లో ఎలాగుంది?"

ప్రశ్నించా డారుణి, ఎంతో ఆత్రంగా.

రాగమంజరి పెదవిపై చింతపువ్వువంటి చిరునవ్వు మెరిసింది. "ఈవేళ కొంచెం తేలికగానే ఉంది. ఇక నాకేమీ భయంలేదు."

అయినా ఆరుణి కామె చిత్తస్థైర్యం మీద అంతగా నమ్మక కలగ లేదు. ఆమెచూపులలో మనశ్చాంచల్యచిహ్నా లింకా మెదులుతూనే ఉన్నాయి.

అంతలో రాగమంజరి నాడీ పరీక్షకోసమని ముంజేయి అతనికి అందించింది.

ఆరుణికి హస్తనిదానం అంతబాగా తెలియదు. అయినా ఏదో విధంగా ధైర్యం చెప్పవచ్చునని అత డామె నాడీ పరిశీలన ప్రారంభిం భించాడు. నాడీ పరీక్ష కనుకూలంగా ఆమె నెమ్మదిగా లేచి కూర్చుంది.

వర్షం క్రమంగా శ్రుతిమించి రాగంలో పడింది. ఆరుణి నాడీ పరీక్ష ముగించి వెంటనే తిరిగి కుటీరంలోకి వెళ్ళిపోవా లనుకొన్నాడు. కాని వర్షంవల్ల అలాగే ఆ నాడీనిదానం కొంచెం ఆలస్యం చేశాడు. అంతలో నూరు రథా లొక్కపరుగు పెట్టిన ట్టురుములు ఫెళఫెళమని మారుమోగాయి. రాగమంజరి ఆ ధ్వని వింటూనే—

"అయ్యో! మునిగి పోతున్నాను, మునిగి పోతున్నాను."

అని గట్టిగా ఒక్క కేక పెట్టి రెండు కళ్ళూ మూసుకుని. వెంటనే అతన్ని గాఢంగా కౌగలించుకుంది.

ఆరుణి ఎంత ప్రయత్నించినా ఆమెకౌగిలి విడిపించుకోలేక పోయాడు. కొంతసేపటి వరకు అతనికొక పెద్ద మొసలివాత పడిపోతున్నట్లనిపించింది. మరి కొంత సేపటి కా స్ఫురణే పూర్తిగా నశించిపోయింది!

క్రమంగా విస్మృతి, ఆనందోన్మాదము ఒక దానితో ఒకటి పెనవేసుకుని అతని హృదయంలోను, శరీరంలోను పక్షవాతంలా కమ్ముకున్నాయి. రాగమంజరి కౌగిలింతలో ఆరుణి పూర్తిగా వివశుడై పోయాడు!

ఆ తరవాత కొంతసేపటికి వాన వెలిసింది. ఆరుణి ఆ అదను కనిపెట్టి చల్లచల్లగా తిరిగి తన కుటీరానికి మళ్ళి పోయాడు. తరవాత క్రమక్రమంగా వారిద్దరిమధ్య కొంచెం గట్టి అనుబంధమే ఏర్పడింది.

రాగమంజరితో అతని కిప్పుడు బాగా సన్నిహిత సంసర్గం కలిగింది. ఆ ఆవేశోన్మాదంలో అతని కా సంసర్గమే ఒక విధమైన ఆధ్యాత్మికసాధనగా ఉపకరించగలదని తోచింది. పాశవిక ప్రవృత్తికి దోహదమిచ్చే కామినీసంసర్గ సురాపానాదులతో తాంత్రికులు చేసే సాధనలు కొన్ని అత డప్పుడప్పుడు చూచాయగా విన్నాడు. వా రా విధంగా సిద్ధి పొందిన సందర్భాలు కొన్ని అతని కింతకు పూర్వం చెవినిపడ్డాయి. ప్రస్తుతం రాగమంజరితో ఏర్పడిన సంసర్గం ఆ విధంగా ఒక తాంత్రిక సాధనగా ఉపకరింపగలదని అతనికి తోచింది.

వారిద్దరు పూజా పుష్పాల కోసమని సాయంకాలవేళ అరణ్యంలోనికి వెళ్ళిపోయేవారు. చీకటిపడేదాకా అరణ్యంలో కాలక్షేపం చెయ్యడం వారి కొక పరిపాటిగా ఏర్పడిపోయింది.

అలా ఒక పక్షంరోజులు గడిచిపోయాయి.

ఆ రోజులలో ఆరుణిముని సామాన్యజీవుల సంసారవ్యాసంగానికి బీజభూతమయిన కామినీవ్యామోహ రహస్యం అంతా పూర్తిగా ఆకళించుకొన్నానని అనుకొన్నాడు. అంతేకాదు: అత డావ్యామోహానికి అతీతుడననీ, అది తనకింక బంధహేతువు కాజాలదనీ అనుకొన్నాడు. ఆ విధంగా

రాగమంజరితో సంబంధం ఏర్పడడం తన తపస్సాధన కొక చివరి మెట్టుగా ఉపకరించినదని కూడా అతనికి స్ఫురించింది. మరికొంత కాలానికి అదంతా చండీదేవి అనుగ్రహ ఫలితమే అని కూడా అనుకొన్నాడు.

క్రమ క్రమంగా రాగమంజరి సంసర్గం తన కేమీ అంటజాలదని అతనికొక దృఢ నిశ్చయం కలిగింది. ఆ నిశ్చయం రాగమంజరితో అతని కేర్పడిన గాఢ సంసర్గానికి మరింత దోహదం కలిగించింది.

అరుణి ఒకనాటి సాయంకాలంవేళ ఇటీవలి కాలంలో తనకు కలిగిన అభిప్రాయాలు, సంకల్పాలు ఒకటొకటిగా రాగమంజరికి తెలియజేశాడు. త్వరలోనే తన సాధన సమాప్తం కాగలదనికూడా అన్నాడు.

మొట్టమొదట అతని ప్రసంగం ధోరణి విని ఆమె ఎంతైనా ఆశ్చర్యపడింది. కాని ఆ ఆశ్చర్యం పైకి కనబడనీయలేదు. పక్కనే గుబురుగా పెరిగిన చిన్ని చేమంతి చిగురాకు కోసి పరధ్యానంగా మునిపంటితో కొరికి కొంటెగా ఒక్క చిన్న చిరునవ్వు విసిరింది:

“ఏమోలెండి! మీ ధోరణి కొక దారి, తెన్నూ లేదని అనుకున్నాను ...దాని కేమిగాని నేను రేపుదయమే నందీశ్వర క్షేత్రానికి వెళ్ళిపోతున్నాను.”

“ఎందుకు?”

“నందీశ్వర స్వామి నొక్కమారు సందర్శించి వత్తామని.”

ఆ మాట విని అరుణి నిర్ఘాంత పోయాడు. నందీశ్వరక్షేత్రం చంపానగరానికి కొంచెం సమీపంలో ఉన్న పుణ్యస్థలం. అక్కడికి వెళ్ళి రావడాని కొక పక్షం రోజులైనా పట్టవచ్చును. అతనికి కొంత సేపటివరకు ఏమీ పాలుపోలేదు.

“ఒక్కర్తెవు ఒంటరిగా వెళ్ళి రాగలవా?”

“అమ్మో! నే నొక్కర్తినీ ఒంటరిగా ఈ కీకారణ్యంలో ప్రయాణం చెయ్యగలనా? మీరు కూడా నాతో రావాలి.”

అరుణి దానికి వెంటనే ప్రత్యుత్తరం ఈయలేదు. అంతలో రాగమంజరి మళ్ళీ అందుకుంది:

“ఈ మధ్యన మీ శిష్యులు నన్ను చూచి ఏమేమో గుసగుస లాడు

కుంటున్నారు. మీ కేమి! మీ రన్నింటికి అతీతులు. కాని నామట్టుకు నాకేమీ పాలుపోకుండా ఉంది. ఒక పక్షం రోజుల పాటూ యాత్ర చేసి వద్దామని ఉంది. మీరుకూడా రండి!"

అని గట్టిగా బలవంత పెట్టింది. ఆరుణి ఆ మరునాటి ఉదయమే ఆశ్రమం శిష్యుల కప్పజెప్పి, రాగమంజరితో కలిసి నందీశ్వర క్షేత్రానికి బయలుదేరాడు. అరణ్యం దాటగానే వారిద్దరు తీర్థ యాత్రాపరుల ధోరణి లోనే వ్యవహరించారు. నాలుగయిదు రోజులలో నందీశ్వర క్షేత్రం చేరుకొన్నారు.

12

నందీశ్వర క్షేత్రంలో అయిదారు రోజులు గడచి పోయేసరికి ఆరుణి, రాగమంజరి బాగా మారిపోయారు.

ఆరుణి అరణ్యంలో తా నవలంబించే నియమాలన్నీ చాలావరకు సడలించివేశాడు.

ఇక రాగమంజరి మాట వేరే చెప్పనే అక్కరలేదు. ఆమె నార చీరలు మొదలైనవన్నీ విసర్జించివేసి ఇంచుమించుగా గణికలాగే వేషధారణ చెయ్యడం మొదలుపెట్టింది.

నందీశ్వర క్షేత్రం చంపానగరాని కనతి దూరంలో ఉన్న ఒక చిన్న నగరానికి మధ్యనున్న పుణ్యస్థలం. అసలే అది ఒక చిన్న నగరం. ఆపైన తీర్థయాత్రాపరు లక్కడికి తండోపతండాలుగా వస్తూంటారు. ఆ జన సమ్మర్దంలో రాగమంజరిని గురించి, ఆరుణిని గురించి ఆలోచించేవా రెవరు?

అతడా నగరంలో ప్రవేశించిన పది పదిహేను రోజులలో ఇంకా బాగా మారిపోయాడు. రాగమంజరితో సంపర్కం కలిగినా అంతకు పూర్వం అదంతా తాంత్రిక సాధనే అని అతడు భావించేవాడు. రాగ మంజరికికూడా మొదట అలాంటి నమ్మకమే కలిగించాడు. ఆ రోజులలో రాగ మంజరి ఒక చిరునవ్వు నవ్వుకొని, అదంతా కొంతవరకు నిజమే నా అనుకుంది.

నందీశ్వర క్షేత్రానికి వచ్చిన తరవాత ఆరుణి మరి తన సాధన మాటే తలపెట్టలేదు. రాగమంజరి అంతకన్నా బాగా తెలుగుమీరి పోయింది. వారిద్దరు ఆ క్షేత్రంలో ఒక ధర్మశాలలో విడిది చేశారు. రాగమంజరి తనదగ్గర రహస్యంగా దాచుకొన్న నగ లొక్కటొక్కటే విక్రయిస్తూ ఏలోటూ రాకుండా అతనితోబాటు సుఖంగా కాలక్షేపం చెయ్యడం మొదలుపెట్టింది.

క్రమంగా అలాగ ఒక నెలరోజులు గడిచిపోయాయి. ఆరుణికా విచిత్ర నాగరికజీవితం ఎంతో మనోహరంగా కనిపించింది. ఒకనాటి సాయంత్రం రాగమంజరి చక్కగా అలంకరించుకుని అతని ఎదుట నిలబడింది. కొంటెగా ఆరుణివైపు చూచింది:

“మా అమ్మ నాకోసమని ఎంతగా కుమిలి కృశించిపోతూందో! నా కొక్కసారి ఆమెను చూచిరావాలని ఉంది. వెళ్ళిరానా?”

ఆరుణి గుండెలో రాయి పడింది. ఆమె అలాగ హఠాత్తుగా వెళ్ళిపోతానని అనడమే అతని కెంతో దుర్భరమైపోయింది.

“మరి నా మాట?”

“మీరుకూడా నాతో వత్తురుగాని!”

“నే నక్కడికి వెడితే మరి నలుగురిలోను తలెత్తుకు తిరగాలా?”

“ఆఁ! నాలుగు రోజులుంటే అదే అలవాటైపోతుంది.”

“నే నక్కడికి రాను!”

“రాకపోయినా నేను వెళ్ళితీరాలి!”

“పోనీ ఆమెనే ఇక్కడికి పిలిపిస్తే——”

రాగమంజరి కతని ఉపాయం కొంతవరకు నచ్చింది.

“అవునవును. ఈ ఉపాయం బాగానే ఉంది.”

అని రాగమంజరి వెంటనే ఒక పరిచారికను పిలిచి రహస్యంగా ఆమె కేదో చెప్పి చంపానగరానికి పంపించింది. ఆమె ధోరణి చూస్తే ఆరుణి మనస్సులో ప్రప్రథమంగా కొంచెం అనుమానం బయలుదేరింది.

“రాగమంజరీ! న న్నీవిధంగా ఇక్కడ ఒంటరిగా విడిచివేసి చంపానగరానికే వెళ్ళిపోవాలని నీ కెలా తోచింది?”

రాగమంజరి పక్కుమని నవ్వి కొంచెం చిలిపిగా అతని కేసి చూసింది.

"స్వామీ! సమస్తము పరిత్యజించి కలకాలం అరణ్యవాసం చేసిన వారు ఒక్క పది రోజులపాటే నన్ను విడిచి ఉండలేకపోతే ఎలాగ?"

ఆ అధిక్షేపం అతని గుండెలో బాకులా పొడుచుకుంది. కాని కొంత సేపటి కాతడా ఆఘాతంలోనించి తేరుకొన్నాడు.

ఆ క్షణం మొదలుకొని అతనికి రాగమంజరి తల్లి ఏ క్షణంలో అక్కడ విరుచుకు పడుతుందో అని భయం వేసింది. అరుణి చూచాయగా ఆ మాట రాగమంజరితో అన్నాడు. అటువంటి భయమేమీ లేదని ఆమె అతనికి గట్టిగా ధైర్యం చెప్పింది. కాని అరుణికి అనుమానం తీరలేదు:

"నిన్న మీ అమ్మ నిక్కడికి రావలసిందని కబురు పంపించావేం?"

"మా అమ్మను కాదు. నా చెలికత్తె కామమంజరినే ఇక్కడికి పంపించ మన్నాను."

"ఆమె నెందు కిక్కడికి పిలిపిస్తున్నావు?"

"ఈ పెద్దతనంలో మా అమ్మ కదిలి రాలేదేమో నని భయపడ్డాను. పోనీ కామమంజరినైనా ఒక్కసారి ఇక్కడికి పంపించమని కబురు పంపించాను."

ఆ సమాధానం అరుణి కేమాత్రమూ అనుమానం తొలగించలేదు. అతడలాగే జిజ్ఞాసాదృష్టితో రాగమంజరికేసి చూచాడు. అది కనిపెట్టి ఆమె అతన్ని గాఢంగా కౌగలించుకుంది:

"స్వామీ! కామమంజరి, నేను చిన్నప్పటి నించి ఒక్క కంచంలో తిని ఒక్క మంచం మీద పడుకున్నాము. మా అమ్మ తరవాత ఆమె తప్ప నా కింకెవరూ లేరు. అందుచేత ఆమె నొక్కమారు చూడాలని కబురు పంపించాను. అంతే!"

ఆపైన రాగమంజరి అతని చెక్కిలిపై చిక్కని ముద్దు ముద్రించింది.

ఆ మరునాడే కామమంజరి అక్కడికి వచ్చింది. చీని-చీనాంబరాల తోనూ చిత్ర విచిత్రమైన అలంకారాలతోనూ పెళపెళలాడిపోతూ, కామమంజరి ఎంతో ఒయ్యారంగా అతనికి సాష్టాంగ నమస్కారం చేసింది. అరుణి అంటీ అంటనట్టుగా ఆమె నాశీర్వదించాడు.

కామమంజరి అక్కడికి వచ్చిన ఉత్తరక్షణంనించి రాగమంజరి ధోరణి బాగా మారిపోయింది. పొద్దస్తమానమూ రాగమంజరి కామమంజరితోనే కలిసి కాలక్షేపం చేసేది. ఎక్కడికి వెళ్ళినా వాళ్ళిద్దరు కలిసే వెళ్ళేవారు.

అరుణికి నానాటికీ రాగమంజరిమీద మమకారం బాగా ఎక్కువై పోయింది.

అత డొక్క నిమిషమైనా ఆమెను విడిచిపెట్టి ఉండలేక పోయేవాడు. ఆ మాట ఒకనా డతడు రాగమంజరితో కూడా అన్నాడు. కాని ఆమె అతని అభిలాష అంతగా లక్ష్య పెట్టలేదు. వినీ విననట్టూరుకుంది. ఒకనా డారుణి రాగమంజరి నెక్కడికీ వెళ్ళవద్దని గట్టిగా కట్టడి చేశాడు. ఆమె అతని మాట కెదురాడలేదు. కాని మరునాటి సాయంకాలమే ఒక చిన్న విశేషం జరిగింది.

అరుణి తన గదిలో ఒక్కడూ ఒంటరిగా కూర్చున్నాడు. అతడు రాగమంజరి ధోరణితో బాగా విసిగిపోయాడు. ఆ మరునాడే రాగమంజరితో కలిసి ఇంకెక్కడికయినా దూర దూర ప్రాంతానికి వెళ్ళిపోవాలని అనుకున్నాడు.

అంతలో హఠాత్తుగా పక్క గదిలోనించి ఉవ్వెత్తుగా ఒక పెద్ద నవ్వు వినిపించింది. రాగమంజరి, కామమంజరి కలిసి ఏదో ఇష్టాగోష్ఠిలో పడ్డారు. రాగమంజరి ఏదో మాటలాడింది. ఆ మాటలలో అరుణికి తన పేరు కొంచెం విస్పష్టంగానే వినిపించింది. ఆపైన కామమంజరి విరగబడి నవ్వడం మొదలు పెట్టింది.

ఆ నవ్వుతో అరుణిఅనుమానం బాగా స్థిరపడిపోయింది. వారిద్దరు కలిసి తన సంగతే ముచ్చటించుకున్నారని, కామమంజరి విరగబడి నవ్వడాని కదే కారణమనీ అతడు గ్రహించివేశాడు. ఆ అవమానంతో అతని ముఖం జేవురించింది.

ఆ మరునాడే రాగమంజరితో ఆ విషయం ప్రస్తావించాలని అరుణి నిశ్చయించుకొన్నాడు.

13

ఆ మరునాటికి ఆరుణిలో బయలుదేరిన జిజ్ఞాస రాగమంజరి పసిగట్టి వేసింది. అప్పటినించి అతన్ని మరింత బిగువుగా తన కౌగిలిలో బంధించి వేసుకుంది. ఆ మైకంలో మరి నాలుగైదు రోజులవరకు ఆరుణి తన ప్రశ్న మాట అంత గట్టిగా పట్టించుకోలేదు. అయినా అతని హృదయంలో అది అప్పుడప్పుడు మెదులుతూనే ఉంది.

ఒకనాటి అపరాహ్ణవేళ రాగమంజరి, కామమంజరి అతిరహస్యంగా గుసగుసలాడుకోవడం ప్రారంభించారు. ఆ గుసగుసలలో ఆరుణికి తన పేరు కొంచెం అస్పష్టంగా వినిపించింది.

మళ్ళీ అతనిలో మథన ప్రారంభమైంది. అంతలో కొంచెం దూరంలో రాగమంజరితల్లి ప్రత్యక్షమైంది. ఆమె అక్కడికి వచ్చినట్టతని కంతవరకు తెలియనే తెలియలేదు! మాటవరసకైనా రాగమంజరి ఆ సంగతి అతనితో చెప్పలేదు. అంతలో అతనికి కామమంజరి ఒక్కమారుగా ఉవ్వెత్తుగా నవ్విన సవ్వడి వినిపించింది. దానికి కారణమేమో అతనికి తెలియలేదు. ఇక ఆనాటి సాయంకాలంలోగా ఆ విషయం అంతా నిష్కర్షగా తేల్చుకునితీరాలని అతడొక నిశ్చయానికి వచ్చేశాడు.

కాని సూర్యాస్తమయం అయినదాకా అతనికి రాగమంజరితో ఆ విషయం ప్రసంగించడాని కవకాశమే దొరకలేదు. దీపదీపాల వేళ ఆరుణికా అవకాశం దొరికింది. కామమంజరి అప్పుడే రాగమంజరి గదిలోనించి వెళ్ళిపోయింది. ఆమె ఏదో పరధ్యానంగా ఆలోచిస్తూ కూర్చుంది. ఆరుణి లోపలికి వెళ్ళగానే ఆమెముఖం ఒక్కమారుగా వికసించింది. ఆమె తటాలున లేచి అతని సరసన జేరింది.

ఆరుణి ఆమెఎదట కొంచెం వ్యంగ్యంగా తన అనుమానాలన్నీ వెళ్ళబోసుకున్నాడు. రాగమంజరి మొట్టమొదట అతని మాటలను వినీ విననట్టుగా, అంటీ అంటనట్టుగా సమాధానాలు చెప్పింది. ఆరుణి అంతటితో విడిచి పెట్టలేదు. ఈ మారు స్పష్టంగా గద్దించి అడిగాడు:

“మీ అమ్మ ఇక్కడికి వచ్చిన విషయం ఇన్నాళ్ళనించి నాతో

ఎందుకు చెప్పలేదు? ఆమె నా ఎదటపడకుండా అలాగలాగ తప్పించుకు తిరగడానికి కారణ మేమిటి?"

రాగమంజరి ఆ ప్రశ్నకు తగిన సమాధానం చెప్పలేకపోయింది. కొంచెంసేపు నిశ్చలంగా అతనివైపు చూచి గట్టిగా కౌగలించుకుంది.

"నేను మీ యెడల ఒక పెద్ద అపచారమే చేశాను. నన్ను మన సారా మన్నిస్తానంటే అదంతా మీతో మనవి చేసుకుంటాను."

ఆమె మరి అతని ముఖం కేసి చూడలేక కనురెప్పలు వాల్చివేసింది.

"ఏమా అపచారం?"

మళ్ళీ అంతకన్నా గట్టిగా గద్దించి అడిగాడు దారుణి. రాగమంజరి అతని పాదాలపై వాలిపోయి అతని కాలివేళ్ళు ముద్దుపెట్టుకుంది.

"నన్ను మన్నిస్తానని అభయ ప్రదానం చేస్తే మనవి చేసుకుంటాను."

అని సానునయంగా, నిశ్చలంగా అతనివైపు చూచింది.

"ఈ ఆషాఢభూతి వినయాల కేమిగాని అసలు జరిగిన కథ ఏమిటో త్వరగా చెప్పు! అస లీ కామమంజరి ఎవరు? ఇక్కడి కెందుకు వచ్చినట్లు? మీ అమ్మ తిన్నగా నా ఎదుట పడకుండా మొహం తప్పించి తిరగడానికి కారణ మేమిటి? కామమంజరికి, నీకు గల సంబంధమేమిటి?"

రాగమంజరి ఆ ప్రశ్నల పరంపరతో అలాగే దిగాలు పడిపోయింది. ఇక లాభంలేదని తన కథ మొదలు పెట్టింది:

"కామమంజరి చంపాధీశ్వరుల ఆస్థానంలో నర్తకి——"

దారుణి అలాగే ఆమె వైపెంతో ఆశ్చర్యంగా చూచాడు. రాగ మంజరి ఒక గుటక మింగి మళ్ళీ అలాగే తన కథ చెప్పుకుపోయింది:

"ఒకనాడు మహారాజ సన్నిధిలో మా ఇద్దరికీ మధ్య నృత్యపరీక్ష జరిగింది. మే మిద్దరము ఆనాడు మేనకావిశ్వామిత్ర నృత్యం చేశాము. నే నానాడు సాక్షాత్తు మేనకలాగే నృత్యం చేశాను. నిజంగా కామమంజరి ఆనా డంత గొప్పగా నృత్యం చెయ్యనేలేదు. అయినా ఆమె యెడల తమ కుండుకున్న మమకారం కొద్దీ మహారాజు ఆమెనృత్యమే గొప్పగా ఉన్నదని ప్రశంసించారు. రాజే తలుచుకుంటే మరి దెబ్బలకేమి కొదవ?

ఆ పైన మిగిలిన విద్వాంసులందరు నా నృత్యమేమీ బాగాలేదని ఈసడించివేశారు. కామమంజరి నృత్యమే నా నృత్యం కన్నా బాగా మిన్నగా ఉన్నదని ఆకాశాని కెత్తివెయ్యడం ప్రారంభించారు. నా కా సమయంలో ఒళ్ళు మండిపోయింది. కాని నే నొక్కత్తెను! అబలను! ఎంత గొప్పగా మేనకా విశ్వామిత్ర నృత్యాభినయం పట్టితే మాత్రం ప్రయోజన మేమిటి?''

అని రాగమంజరి ఉసూరుమని ఒక్క నిట్టూర్పు విడిచి పెట్టింది. ఆరుణి కామె ఆ కథ ఎందుకుపక్రమించిందో బోధపడలేదు:

''అయితే ప్రస్తుతం కామమంజరి ఇక్కడికి రావడానికి, దీనికి సంబంధ మేమిటి?''

అని అన్నా డెంతో విసుగ్గా.

రాగమంజరి క్షణంసే పాగి మళ్ళా మొదలు పెట్టింది:

''స్వామీ! అదే విన్నవించుకుంటున్నాను. కొంచెం సావధానంగా చిత్తగించండి. తరవాత ఇష్టాగోష్ఠిలో మహారాజు ప్రసంగం క్రమక్రమంగా విశ్వామిత్ర మహర్షి తపోనిష్ఠమీదికి తిరిగింది. తరవాత మేమంతా జితేంద్రియులైన మహాత్ముల మహిమలను గురించి ప్రసంగించుకొన్నాము. కొంతసేపటి కా ప్రసంగంలో మీ మాట వచ్చింది. మహారాజు మీరు సాక్షాత్తు మహర్షి కల్పులనీ, పరమబ్రహ్మణ్యులనీ ప్రశంసించారు.

''కామమంజరికి మిమ్మల్నిగురించి ఏమీ తెలియనే తెలియదు. అయినా ఆమె ఇచ్చకాలు చెప్పడం మొదలుపెట్టింది. మహారాజన్న మాటకు సరిగా అదేధోరణిలో పక్కతాళం వెయ్యడం ప్రారంభించింది.

''నా కా కామమంజరి ఇచ్చకాల ధోరణి గమనించగానే హఠాత్తుగా అరికాలిమంట నెత్తికెక్కింది. ఇక తమాయించుకోలేక పోయాను:

'''మహారాజా! ఎందు కీ ప్రగల్భాలు? పురుషులంతా ఎంతటి బ్రహ్మణ్యులయినా కాంతామణులకు దాసానుదాసులే!'

''అని నా ఉక్రోషం పట్టలేక, ఉన్నది కాస్తా దురుసుగా దులిపేశాను.''

అని రాగమంజరి తన కథ అంతటితో ఆపివేసి, కొంచెం సిగ్గుతో

ఆరుణివైపు చూచింది. ఆరుణి ఆమాట విని నిలువునా నిర్ఘాంతపోయాడు. అంతలోనే రాగమంజరి తిరిగి తన కథ ప్రారంభించింది:

"స్వామీ! నే నాసమయంలో మహారాజు మీద, కామమంజరి మీద బయలుదేరిన అక్కసుకొద్దీ ఆమాట అనేశాను. అంతేగాని అది మీమీద అగౌరవంకొద్ది అన్న మాట కానేకాదు. నే ననుకున్నట్లే ఆమాట మహారాజుకు, రాగమంజరికీ బాగా పొడుచుకుంది.

"ఆపైన కామమంజరి నామాటకు హఠాత్తుగా అడ్డుతగిలి ఆరుణి ముని పరమబ్రహ్మణ్యులనీ, మహాత్ములనీ అన్నది. వెంటనే మహారాజామెకు పక్కతాళం వేశారు. దానితో నా ఉక్రోషం బాగా రెచ్చిపోయింది. 'ఆఁ, దానికేమిలెండి! ఎంతటి మునీశ్వరులనైనా మూడు నిమిషాలలో నాకు దాసానుదాసులుగా చేసివేస్తాను! కావలిస్తే పందెం వెయ్యండి!' అన్నాను. దానిమీద కామమంజరి మరింతగా రెచ్చిపోయింది.

"'ఆరుణిముని అలాంటివారు కానేకారు. ఒకవేళ నీవేకనక ఆయన వ్రతభంగం చెయ్యగలిగితే నృత్య నాట్యాలలో ఇక నీవే యీ రాజ్యానికంతటికీ గొప్పదానివని ఆక్షణంనించి అంగీకరించి నీవెనక నిలబడతాను. సరిగదా!' అని గట్టిగా కవ్వించింది. మహారాజామెను వెనక వేసుకువచ్చి 'చేతనైతే ఆ పందెం గెలుచుకో'మని నన్ను చూచి అతిహేళనగా నవ్వారు! వారిద్దరు ఏకమై నన్నావిధంగా కించపరచడంతో ఆవేళ అంతా నాకిక నిద్రపట్టలేదు. ఆ మరునాడే బయలుదేరి మీ ఆశ్రమానికి వచ్చివేశాను."

రాగమంజరి ఆపైన మరి మాట్లాడలేక నెమ్మదిగా తలవంచుకుంది:

"స్వామీ! నేను మీయెడల వల్లమాలిన మహాపచారం చేశాను. నన్ను మన్నించండి."

అని ఆరుణిపాదాలు రెండూ పట్టుకుంది.

కథ చిట్టచివరిఘట్టంలోకి వచ్చేసరికి ఆరుణి మరి తన కళ్ళే నమ్మలేకపోయాడు. ఒక్కనిమిషంసేపు ఆలాగే శిలాప్రతిమలా నిర్ఘాంతపోయాడు:

"రాగమంజరీ! అయితే ఇన్నాళ్ళనుంచీ నీవు ఆడింది అంతా వట్టి కపటనాటకమేనా?"

రాగమంజరి తలఎత్తి క్షణకాలం అతని ముఖవైఖరి గమనించింది:

"స్వామీ! మీరన్నట్టు ఇన్నాళ్ళనించి నేను నిజంగా కపటనాటకమే ఆడాను. కాని ఈ క్షేత్రానికి వచ్చినప్పటినుంచీ నేను చేసినదానికింతైనా పశ్చాత్తాపపడ్డాను. నేను చేసిన పాపానికి మరి ప్రాయశ్చిత్తం లేదని నాకు తెలియకపోలేదు. అయినా దయతలిచి నన్ను కొంచెం మన్నించండి."

ఆమె అతని పాదాలు రెండూ మరింత గట్టిగా అదిమిపట్టుకుంది. ఆమాటతో ఆరుణిశరీరం క్రోధావేశంతో గజగజ వణికిపోయింది. అతడొక్కమారుగా విరుచుకుపడ్డాడు:

"అయితే ఈ కామమంజరిని, మీ అమ్మని ఇక్కడి కెందుకు పిలిపించావు? నీగొప్ప చెప్పుకుని నలుగురిలోను నన్నవమానపరచడానికేనా?"

ఉరుమువంటి ఆప్రశ్న విని రాగమంజరి అంతగా నిర్ఘాంతపడలేదు.

"వారిద్దరు మిమ్మల్ని చంపానగరానికి తోడుకురమ్మన్నారుగాని నేనే దానికంగీకరించలేదు. తిరిగి మీతోకలిసి ఆశ్రమానికే వెళ్ళిపోతానని, ఇప్పటినించీ నిజంగా నాకు ప్రపంచంపై విరక్తికలిగిందనీ అన్నాను. నామాట నమ్మండి! నన్ను మన్నించండి."

అని రాగమంజరి అతన్ని మరింత ఆప్యాయంగా బతిమాలుకోవడం మొదలుపెట్టింది. ఆపైన వెంటనే అతని పాదాలమీద వాలిపోయింది.

కాని అదంతా కేవలం నటనే అని గ్రహించడానికి ఆరుణి కొక్కక్షణంకూడా పట్టలేదు. ఉత్తరక్షణంలోనే లేచినిలబడి ఒక్కదూకులోనే అతడామెపట్టు విడిపించుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు. ఆగదిలోనే కుప్పగా కూలబడిపోయిన రాగమంజరికి "ఛీ పాపాత్మురాలా! ఎంత ద్రోహాని కొడిగట్టావు! ఇప్పటికీ ఇంకా నటనేనా? చాల్చాలు లే! పో!" అన్న మాటలు విస్పష్టంగా వినిపించాయి.

14

ఆరుణి ఒళ్ళు తెలియకుండా అలాగే ఆ మసక మసక చీకటిలో పడి తొందర తొందరగా నడిచివెళ్ళిపోయాడు. అంతేగాని ఒక్కమా

కైనా వెనక్కి తిరిగి చూడలేదు. అత డెక్కడికి నడిచివెళ్ళి పోతున్నాడో అతనికే తెలియదు!

ఆరుణి కింక ఆక్షేత్రంలో ఒక్కక్షణం కూడా ఉండడానికి మనస్కరించలేదు. ఒక్క దూకులో నందీశ్వర క్షేత్రం పొలిమేర దాకా నడిచి వెళ్ళిపోయాడు. అప్పటికి బాగా చీకటి పడింది. అతనికి మార్గం కూడా తిన్నగా కనిపించలేదు. పైగా గమ్యస్థాన మేదో అతనికే తెలియదు! అలాగలాగ నడిచి పోగా పోగా ఆ క్షేత్రానికి పొలిమేరలో అతని కొక జీర్ణ దేవాలయం కనిపించింది.

ఒళ్లెరగని నడకతో ఆరుణి బాగా అలిసిపోయాడు. ఆ దేవాలయం చూడగానే అతనికి ఆరాత్రి కక్కడ విశ్రమించాలని అనిపించింది. అత డలాగే ఆ జీర్ణదేవాలయ మంటపంలో చదికిలపడ్డాడు. కొంత సేపటికి నెమ్మదిగా అక్కడ మేనువాల్చాడు.

అప్పటి కతనికి కొంచెం స్పృహవచ్చినట్లయింది. అలాగే పడుకుని గతచరిత్ర అంతా తలుచుకోవడం మొదలుపెట్టాడు. అదంతా అతని కొక పీడకలలా కనిపించింది. అలాగ తలుచుకుంటున్నంతసేపూ అతని నోటినుండి అప్రయత్నంగా "ఎంతటి ద్రోహాని కొడిగట్టింది!" అన్న వాక్యం నాలు గైదు మారులు వెలువడింది.

కొంతసేపు గడిచిపోయేసరి కిన్నాళ్ళనించీ జరిగినదంతా అతనికి కొంచెం స్పష్టంగా తెలిసింది. ఆశ్రమానికి వచ్చినప్పుడు వేశ్యమాత ఆడినది అంతా కేవలం నాటకమే అని అతని కొక్కక్షణంలో అవగతమై పోయింది. గంగానదిలో మునిగిపోతున్నట్లు రాగమంజరి కేకలుపెట్టడం కూడా కేవలం నటనే అని అత డొక్కక్షణంలో గ్రహించి వేశాడు.

సరీగా అదే సమయంలో అతని కెదురుగా ఒక మూల కొంచెం శిథిలమైపోయిన గ్రామదేవతా విగ్రహం కనిపించింది. అది చూడగానే అతనికి ఆశ్రమంలో చండీ దేవతామూర్తి జ్ఞాపకం వచ్చింది.

"అవిచ్ఛిన్నంగా రెండు పుష్కరాలపాటూ దేవతపాదా లాశ్రయించాను. నా తపఃఫలితం అంతా చిట్టచివరి కీ విధంగా బుగ్గి అయి పోయింది."

అని సణుగుకోవడం మొదలు పెట్టాడు. అతని కా దేవతా విగ్రహం చూస్తూంటే హృదయంలో పట్టరాని అసహ్యభావం బయలు దేరింది. ఆరుణి ఇక ఆ దేవతముఖం చూడలేక పెడమొహం పెట్టుకుని కూర్చున్నాడు.

క్రమక్రమంగా అతని హృదయంలో ప్రస్తుతం తన గమ్యస్థానాన్ని గురించిన జిజ్ఞాస బయలుదేరింది. మొట్ట మొదటగా తిరిగి తిన్నగా తన ఆశ్రమానికే వెళ్ళిపోవాలని అనుకొన్నాడు. శిష్యుల కింకా తనమీద అంతటి అనుమానం కలగలేదని అత డంతకు పూర్వమే గ్రహించుకొన్నాడు. ఆశ్రమానికి చేరుకొంటే తిరిగి నిశ్చలహృదయంతో జపతపాదు లుపక్రమింపవచ్చునని అతనికి ఆశ.

కాని తిరిగి తన ఆశ్రమానికి వెళ్ళడం అంటే అతనికి రుచించలేదు. ఇక మిగిలినది మరీచిమహర్షి ఆశ్రమం. ఆమాట తలుచుకొంటేనే అతని కెందుకో పెద్ద సంకోచం బయలుదేరింది. తా నీ విధంగా భ్రష్టుడైపోయి మరీచిమహర్షి ఆశ్రమం చేరుకొంటే ఆయన ఆప్యాయంగా ఆదరించగల డనే ఆశ ఏమి ఉంది?

ఆ మహర్షి తన కథ విని మరి ఆశ్రమం దరిమానానికి కూడా రావద్దని దూరదూరంగా తరిమి వెయ్యవచ్చును! మరి గత్యంతరం? చల్లచల్లగా తన ఆశ్రమానికి వెళ్ళిపోవడమే అతని కిక శరణ్యంగా కనిపించింది. కాని ఆ విధంగా తన ఆశ్రమానికి చేరుకోవడం అతని కంతగా రుచించలేదు.

అతని గుంజాటన ఎంతసేపటికీ నిష్కర్షగా ఎటూ తేలలేదు.

దానితో అతనికి ఆ రాత్రంతా తిన్నగా నిద్ర పట్టలేదు. తెల్లవారు జామున కొంచెం చిన్న కునుకు పట్టింది. నిద్రలేవగానే, ఆరుణికి, ఆచార్యుని సన్నిధికి వెళ్ళిపోయి తన పాపపంకిలగాథ అంతా ఆ మహర్షికి ఆమూలాగ్రంగా నివేదించి, ఆయనపాదా లాశ్రయించడమే శరణ్యమని అనిపించింది. ఆ తరువాత ఆ జీర్ణ దేవాలయంలో అత డొక్క క్షణమైనా నిలవలేదు. వెంటనే బయలుదేరాడు. మార్గంలో అన్నపానాదుల విషయం కూడా అత డంతగా ఆలోచించలేదు. ఎక్కడైనా లభ్యమైతే కాయో కసరో తిని ఆనాటి కలాగే కాలక్షేపం చేసేవాడు.

ఆరుణి అలా ఏకబిగిని పది పదిహేను రోజుల పాటు ప్రయాణం సాగించి ఒకనాటి ఉదయానికి మరీచిమహర్షి ఆశ్రమం చేరుకొన్నాడు.

కాని మహర్షికి ఎదుటపడడాని కతని కెంతో సంకోచం కలిగింది. అయినా ధైర్యం వహించి అతని సన్నిధికి వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆరుణి కన్నీటితో ఆచార్యుని పాదాలు తడిసిపోయాయి. మరీచి ఎంతో ఆప్యాయంగా పిలిచి "లే, నాయనా!" అని ఆజ్ఞాపించేదాకా అత డాచార్యుని పాదాలు విడిచిపెట్టలేదు. వాత్సల్యపూరితమైన అతని పిలుపు వినగానే ఆరుణికి కొంచెం ధైర్యం వచ్చింది. వెంటనే నెమ్మదిగా లేచి కూర్చున్నాడు.

15

మరీచి ఆరుణి నెంతో వాత్సల్యంతో ఆదరించి అతని యోగ క్షేమా లడిగి తెలుసుకొన్నాడు. మహర్షి ఆదరం చవిచూచిన ఆరుణి కప్పటికి బాగా ధైర్యం కలిగింది. తల వంచుకుని తన విషాదగాథ అంతా ఆమూలాగ్రంగా మరీచిమహర్షికి విన్నవించుకొన్నాడు. ఆ కథ పూర్తికాగానే మహర్షి తనమీద విరుచుకుపడగల డేమో అని ఆరుణి కొంచెం భయపడ్డాడు. కాని మహర్షి ఆరుణిని చల్లనిచల్లని మాటలతోనే ఓదార్చాడు. అంతేగాని అతనిని పల్లెత్తుమాట అనలేదు. ఆ అపార వాత్సల్యం చవిచూచిన ఆరుణి కంఠం గద్గద భారంతో వణికిపోయింది. అతడు తన కిటీవల కలిగిన ఒక సంశయం మహర్షికి విన్నవించుకున్నాడు:

"మహర్షీ! నేను రాగమంజరి మీద ఎంతైనా జాలి దలిచాను. ఆమె నుద్ధరించవలె ననే అనుకున్నాను. చివరి కా పాపాత్మురాలు నన్నీ విధంగా వంచించడానికి కారణ మేమిటి? నే నేమి పాపం చేసుకొన్నాను?"

మహర్షి పెదవిపై చిరునవ్వు చిగిరించింది. వెంటనే కొంచెం మృదువుగా మందలించాడు:

"ఆరుణీ! నీ వామె నెందుకు నిందిస్తావు! దీనిలో నా కామె చేసిన తప్పిద మేమీ గోచరించడం లేదు!"

ఆరుణి తెల్లబోయి మహర్షివై పలాగే చూస్తూ కూర్చున్నాడు. మరీచిమహర్షి అంతలోనే అందుకొన్నాడు:

"నీ హృదయసంకల్పం పైపైకి నిష్కల్మషంగా ఉంటే ఉండ వచ్చును. కాని అంతరాంతరాలలో నీలోని కామలాలస పూర్తిగా నశించ లేదు. ఆ కారణం వల్లనే మొట్టమొదటగా నీ కామె యెడల ఆ విధంగా జాలికలిగింది. అదే చిట్టచివరికి నీ భ్రష్టత్వానికి దారి తీసింది. అనవసరంగా ఆమెను నిందించడం వల్ల ప్రయోజన మేమిటి?"

అయినా ఆరుణి కా విషయం పూర్తిగా బోధపడలేదు. కొంచెం సేపాలోచించి మెల్లిగా నసిగాడు:

"నా కింకా సందేహ నివృత్తి కాలేదు. దయఉంచి నా అజ్ఞత మన్నించండి...అయితే మొదటినించీ ఈ పన్నాగం అంతా పన్ని నన్నీవిధంగా మోసగించినది ఆమే కదా?"

"కావచ్చును! కాని నీ హృదయం నిష్కల్మషంగా ఉన్నప్పుడు ఆమె ఎంత పాపబుద్ధితో వస్తే మాత్రం నిన్నేమి చెయ్యగలదు?"

అని మరీచిమహర్షి తిరిగి ఒక్క నవ్వు నవ్వాడు:

"ఆరుణీ! అజ్ఞులు తమ లోకప్రవృత్తికి కేవలం బాహ్యసంఘటనలే ప్రధాన కారణాలని భ్రమిస్తారు. అంతేగాని తమ లోలోపలి సంస్కారాల సంకల్పాల వల్లనే బాహ్యసంఘటన లుద్భవిస్తాయని గ్రహించుకో లేరు!"

"వెర్రివాడా! నీ హృదయం నిష్కల్మషమైతే ప్రపంచంలోని వారంతా సజ్జనులుగానే కనిపిస్తారు. లేకపోతే వారంతా దుష్టులుగానే భాసిస్తారు. ఈ రహస్యం తెలిస్తే ఒకర్ని నిందించవలసిన అవసరమే లేదు. కనుకనే నిన్ను ముందుగా నీ ఆత్మసముద్ధరణ విషయం ఆలోచించుకోవల సిందని అన్నాను—జ్ఞాపకం ఉన్నదా?"

ఆరుణి మరీచిసూక్తులు జాగ్రత్తగా విని ఒక నిట్టూర్పు విడిచి పెట్టాడు:

"అయితే జీవుల కిక పతితులు, దుఃఖితులు అయినవారి నుద్ధరించే అధికారమే లేదన్నమాట!"

మరీచిముఖం మళ్ళీ కొంచెం జేవురించింది.

"త్రికరణశుద్ధి లేనివారి కా అధికారం లేనిమాట నిజమే! అదికాక నిన్నింకా ఒక్క భ్రమ పట్టుకుని పీడిస్తూంది. నీ వెన్నడూ ఇంకొకరి నుద్ధ

రించలేవు! అది చెయ్యగలిగిన దా జగన్మాత మాత్రమే! ప్రపంచం అంతా ఆ జగన్మాత స్వరూపమే! కనక నీ వొకరికి చేయగలిగిన ఉపకృతి ఏదైనా ఉంటే అది నీ ఆత్మోద్ధరణకు మాత్రమే ఉపకరించగలదు. కనక నీ వొకరికి ఉపకృతి చేస్తున్నావని భావించడం కేవలం అహంకారమే! ఆ అహంకారనాశనం జరిగేవరకు నీ కొకరిని ఉద్ధరించే అధికారమే లేదు. ఇది ముమ్మాటికీ నిజం. ఈ ఆర్యసూక్తి జాగ్రత్తగా మననం చేసుకో!"

ఆరుణి కా ఉపదేశంతో కొంచెం ఊరట కలిగింది. అయినా అతనికి రాగమంజరి యెడల ద్వేష భావం ఇంకా బాగా సడలలేదు. ఒక్క నిట్టూర్పు విడిచి పెట్టాడు:

"ఏది ఏమైనా ఆ పాపాత్మురాలు నా కొక అశనిపాతంలా దాపురించింది."

అని తల వంచుకొన్నాడు. మరీచి మళ్ళీ అతన్ని మందలించాడు:

"నాయనా! ఈ అఘాతంవల్ల నీలోని పాపచింత అంతా క్షాళితమై పోయింది. ఇక ముందిది నీ సాధన కెంతైనా ఉపకరించగలదు. కనుక ఆమె నీ కీ విధంగా ఉపకరించినదనే అనుకో! ఇక ఇప్పటినించీ ఆమె నెన్నడూ నిందించకు. ఆమె జగన్మాతస్వరూపిణి అని భావించుకో! ఆమె ఆ విధంగా నీ హృదయకల్మషం పోగొట్టి నిన్నుద్ధరించినదనుకో! అదే నీకు శ్రేయస్కరం!"

ఆరుణి నెమ్మదిగా అక్కడినించి లేచి వెళ్ళి నాలుగైదు రోజుల పాటు మహర్షి చేసిన సదుపదేశం అంతా జాగ్రత్తగా మననం చేసుకొన్నాడు.

క్రమంగా ఆ ప్రశాంతాశ్రమంలో అతని హృదయం పద్మముకుళంలా స్వచ్ఛమై వికసించింది.

"నిజానికి నాలో అంతకుపూర్వం అంతర్నిహితంగా ఉండిపోయిన కామసంకల్పంవల్ల నేనే పతితుడనైపోయాను. ఆ తరుణంలో రాగమంజరే నన్నుద్ధరించింది."

అని ఆలోచిస్తూ ఒక్క చిరునవ్వు నవ్వుకున్నాడారుణి. ఆ భావనతో అతని అహంకారం అంతా పటాపంచలై పోయింది. అదే క్షణంలో అతని హృదయంలో ఒక వినూతన దివ్య విజ్ఞానజ్యోతి మెరిసింది.

—o—